ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం : fb.com/vaartha
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
27-8-2024 మంగళవారం సంపుటి: 30 సంచిక: 209 పేజీలు: 8+16 వెల: 6.50

కొత్త పార్టీ 'ఏవిఎం' ప్రారంభించిన యశ్వంత్ 2
భారత్‌లోని ఇద్దరు దౌత్యవేత్తలపై బంగ్లా వేటు 5

## రాయదుర్గంలో అక్రమ నిర్మాణాలు
# నేలమట్టం




కూల్చివేతల ప్రకంపనలు

సోమవారం హైదరాబాద్‌లోని రాయదుర్గం లెదర్ ఇండస్ట్రీ స్థలంలో వెలసిన నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

### దశాబ్దాలుగా కోర్టు వివాదంలో ఉన్న భూమి
### నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేశారని స్థానికుల ఆందోళన

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 26 ప్రభాతవార్త:** రాయదుర్గంలోని లెథర్ ఇండస్ట్రీ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను సోమవారం జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. సదరు స్థలం మీద కొన్ని సంవత్సరాలుగా కోర్టులో వివాదం నడుస్తుండగా, గతంలో కోర్టు లెథర్ ఇండస్ట్రీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. తాజాగా సదరు భూమిని లెథర్ ఇండస్ట్రీ టిఎస్ఐఐసికి కేటాయించగా, అక్రమ నిర్మాణాలను ఖాళీ చేయాలని పలుమార్లు నోటీసులు జారీ చేసింది. నోటీసులకు నిర్మాణదారులు స్పందించకపోవడంతో సోమవారం కూల్చివేతలు చేపట్టారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని రాయదుర్గం పైగా సర్వే నెంబరు 1,3,4,19లలో తెలంగాణ లెథర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంటు ప్రమోషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు స్థలం ఉంది. ఇదే స్థలంలో లిడ్‌క్యాప్ సంస్థ ఉంది. కాగా ఈ స్థలంలో 6ఎకరాల విస్తీర్ణాన్ని గతకొంత కాలం క్రితం టిఎస్ఐఐసికి కేటాయిస్తూ లెథర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంటు ప్రమోషన్ కార్పొరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా ఈ ఆరు ఎకరాల పరిధిలో 500 గజాల విస్తీర్ణంలో రెండు పక్కా భవనాలు, మరో 500 గజాల విస్తీర్ణంలో మూడు పాక్షిక రేకుల షెడ్లు ఉన్నాయి. ఈ నిర్మాణాలను ఖాళీ చేయాలని లెథర్ ఇండస్ట్రీ డెవలప్‌మెంటు కార్పొరేషన్ పలుమార్లు నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపై భవన యజమానులు స్పందించకపోవడంతో సోమవారం కూల్చివేతలు చేపట్టారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, టిఎస్ఐఐసి అధికారులతో >>2





## 30 ఆసుపత్రులపై
# సిఐడి కొరడా

### నకిలీ బిల్లుల సిఎంఆర్ఎఫ్ స్కాం వెలుగులోకి
### భారీగా నిధులు గోల్‌మాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** సిఎంఆర్ఎఫ్‌లో జరిగిన స్కామ్ ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. రంగంలోకి దిగిన సిఐడి కఠిన చర్యలు మొదలు పెట్టింది. నకిలీ బిల్లులు పెట్టి ప్రభుత్వాన్ని మోసం చేశారంటూ తెలంగాణలోని 30 ఆసుపత్రులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. తాజాగా సిఎంఆర్ఎఫ్ స్కాంపై సిఐడి 6 కేసులు నమోదు చేసింది. వైద్యం చేయకపోయినా >>2

# రాష్ట్రమంతా ఐఆర్ స్కూళ్లు

### రూ. 5 వేల కోట్లతో 100 నియోజకవర్గాల్లో ఏర్పాటు
### విద్య, ఉద్యోగాలు, వ్యవసాయం మా ప్రాధాన్యం
### వచ్చే ఒలింపిక్స్‌లో పతకాలు సాధించేలా స్పోర్ట్స్ వర్సిటీ
### స్కిల్ వర్సిటీలో అన్ని రకాల డిప్లొమా కోర్సులు
### మెయిన్స్ విద్యార్థులకు రూ. లక్ష చెక్కులు అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్



సోమవారం హైదరాబాద్‌లో మెయిన్స్ విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు26:** ద్రౌపది స్వయంవరం సమయంలో అర్జునుడి లక్ష్యం చేపకన్నుపై కేంద్రీకృతమైనట్లే సివిల్స్‌లో ఎంపిక కావడమే ఏకైక లక్ష్యమే మీకు ఉండాలని, కుటుంబ,ఆర్థిక,ఇతర సమస్యలను పట్టించుకోవద్దని సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన వారిని ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నుంచి సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించిన 135 మందికి రాజీవ్ సివిల్స్ అభయ హస్తం కింద రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించే కార్యక్రమం సచివాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ప్రధాన అంశం నిరుద్యోగమేనని, నిరుద్యోగులు, విద్యార్థుల ఉద్యమాలతోనే తెలంగాణ రాష్ట్ర సాధన జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 30వేల ఉద్యోగ నియామకాలు చేపట్టామని, గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3, డిఎస్సీతో కలిసి మరో 35వేల ఉద్యోగాల కల్పనకు నోటిఫికేషన్లు ఇచ్చి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం తెలంగాణలో విద్యా రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. వసతి గృహాలను అద్దె భవనాల్లో నిర్వహించారని, వందల మంది విద్యార్థులుంటే ఒకటిరెండు బాత్‌రూంలతో సరిపెట్టారని మండిపడ్డారు. తాము మాత్రం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వసతి గృహాలన్నీ ఒకే కాంపౌండ్‌లో ఉండేలా, 20 నుంచి 25 ఎకరాల్లో రాష్ట్రంలో వంద నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ (ఐఆర్)స్కూల్స్ పేరుతో నిర్మిస్తున్నామని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు కేటాయించామని ముఖ్యమంత్రి తెలిపారు. మేం కేంబ్రిడ్జిలో, అక్స్‌ఫర్డ్‌లో, ఉస్మానియాలో చదువుకున్నామని, వాటిలో చదువుకున్న వారు గర్వంగా చెప్పుకుంటారని, భవిష్యత్‌లో తాము >>2



## 3 నదులపై సరికొత్త
# వారధులు

### రీజనల్ రింగ్‌రోడ్ ఉత్తర దిశలో ఏర్పాటుకు చర్యలు
### తూప్రాన్‌లో హరిద్రా నది, శివంపేటలో మంజీరా, పొద్దుటూరులో మూసీపై నిర్మాణం
### వేగంగా సాగుతున్న భూ సేకరణ ప్రక్రియ

**హైదరాబాద్, ఆగస్టు 26,ప్రభాతవార్త:** తెలంగాణ ఆర్థికసామాజిక అభివృద్ధికి జీవగర్రగా భావిస్తున్న రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర దిశలో మూడు నదులపై వారధులు నిర్మాణంకు నేషనల్ హైవే ప్రణాళికలు సిద్ధం చేసింది. తెలంగాణ ప్రభుత్వం వచ్చే ఐదు ఆరు నెలలో రీజినల్ రింగ్‌రోడ్ పనులు ప్రారంభించాలనే లక్ష్యంతో భూసేకరణ ప్రక్రియ వేగంగా ముగించేందుకు చొరవచూపుతున్నది. భూసేకరణ విషయంలో నిర్వాసితులను ఒప్పించగలిగితేఇక అవార్డులను పాస్ చేసే ప్రక్రియ చేపడుతోంది. లోక్‌సభలో ఎంపి ఈటెల రాజేందర్ ప్రశ్నకు సమాధానంచెబుతూ కేంద్ర ఉపరిత రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారి భూసేకరణ చేసి ఇస్తే వెంటనే రోడ్డు పనుల నిర్మాణంకు టెండర్ నోటిఫికేషన్‌కూడా వేస్తామని చెప్పారు. దీనితో ఉత్తరదిశలో రోడ్‌కు సంబంధించిన డిపిఆర్ అనుగుణంగా డిజైన్ ,ఇంటర్ చేంజ్ వంతెనలు, నది వంతెనలు అండ్ పాస్ వంటి తదితర నిర్మాణాల డిజైన్లను సిద్ధం చేసేపనిలో ఎన్‌హెచ్ అధికారులు సిద్ధమైనారు. ముఖ్యంగా రీజినల్ రోడ్ మూడు నదులను దాటుకొంటు పోతుండటంతో వంతెనలు నిర్మాణం కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. తొలుత 8లైన్ల వంతెనలను భవిష్యత్ అవసరాల కోసం నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే మొదటి విడుత నాలుగు లైన్లతోనేసరిపెట్టుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. మిగితా వరుసలు భవిష్యత్‌లో పెరిగే రద్దిని బట్టి నిర్మాణం చేయాలనే నిర్ణయానికి వచ్చినారు. మంజీరా నదిపై పుల్కల్ మండలం శివంపేట గ్రామ సమీపంలో దాదాపు 600 మీటర్ల పొడవైన వంతెన నిర్మించబోతున్నారు. దానికి దాదాపు రూ.75కోట్లు అంచనావ్యయంగా మదింపు చేశారు. మెదక్ సంగారెడ్డి, నాందేడ్ హైదరాబాద్ జాతీయ రహదారి కలిసే ప్రాంతంలో మంజీర నదిపై వంతెన నిర్మించాలని స్థల ఎంపిక చేశారు. మంజీరా నదికి ఉపనది అయిన హరిద్రా నది గజ్వేల్ గుండా ప్రవహిస్తుండటంతో తూప్రాన్ వద్ద రీజినల్ రింగ్‌రోడ్‌కు వంతెన నిర్మాణం అనివార్యమైంది. జాతీయరహదారి 44పై ఇప్పటికే అక్కడ ఒక వంతెన ఉంది. దాని చేరువలలో కొత్త వంతెన రాబోతున్నది. మూసి నదిపై నిర్మించిన దాదాపు కిలో మీటరు నిడివితో పొద్దుటూరు వద్ద వాగుపై వంతెనను నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ 100కోట్లతో అంచనా వ్యయంతో ప్రణాళికనుసిద్ధం చేసింది..ప్రస్తుతం భువనగిరి నల్లగొండ రహదారిపై మూసి నదిపై వలిగొండ వద్ద వంతెన ఉంది. మరొక కొత్తది రీజినల్ రింగ్‌రోడ్‌లో భాగంగా అక్కడ పొద్దుతూటు గ్రామ శివారులోవస్తున్నది. నాలుగు వరసల రోడ్డుకు సరిపడా భూమిని >>2



## సార్! మీ పెళ్లెప్పుడు?
### 30 యేళ్లుగా ఇదే ఒత్తిడి: కాశ్మీరీ యువతుల ప్రశ్నకు రాహుల్ జవాబు

**శ్రీనగర్, ఆగస్టు 26:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీముందు మరోసారి పెళ్లిప్రస్తావన వచ్చింది. వివాహం ఎప్పుడుచేసుకుంటారనికాశ్మీరీయువతులు అడిగినప్రశ్నకు జవాబిస్తూ ఇరవై 30 ఏళ్లుగా ఈ ఒత్తిడిని అధిగమించానని చెప్పారు. ఇటీవల జమ్ము కాశ్మీర్‌లోపర్యటించిన రాహుల్ శ్రీనగర్‌కు చెందిన పలువురు విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ >>2

## రెండు వారాల్లో కొత్త
# విసిల నియామకం
### వర్సిటీల్లోని ఖాళీలు కూడా భర్తీ చేస్తాం: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు26:** 10,15 రోజుల్లోనే రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల నియామకం చేయబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. యూనివర్సిటీల్లో ఖాళీలనీ భర్తీ చేయబోతున్నామని, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం చేపడతామని వెల్లడించారు. సివిల్స్ మెయిన్స్‌కు అర్హత సాధించినవారికి రాజీవ్ సివిల్స్ అభయ హస్తం కింద రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించే కార్యక్రమం సచివాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీల వీసీల నియామకంపై ప్రకటన చేశారు. విద్యార్థులకు, విద్యారంగానికి తాము ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నామని కొందరు కుట్రలు చేస్తున్నారని సిఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తుంటే పరీక్షలు వాయిదా వేయాలని విద్యార్థులతో ఆందోళన చేయిస్తున్నారని మండిపడ్డారు. పోటీ పరీక్షలు వాయిదా వేస్తే ప్రభుత్వానికి నష్టం ఉండదని, కానీ వాటికి ప్రిపేర్ అయ్యే విద్యార్థులు నష్టపోతారని పేర్కొన్నారు. గతంలో విద్యార్థులను రెచ్చగొట్టి, వారి ప్రాణాలు తీసి రాజకీయ లబ్ది పొంది అధికారంలోకి వచ్చారని ముఖ్యమంత్రి మండిపడ్డారు. పదేళ్ల పాటు ఉద్యోగ కల్పనకు పట్టించుకోని వారు, తమ ఉద్యోగాలు పోగానే మళ్లీ విద్యార్థులను రెచ్చగొట్టే పనికి పూనుకున్నారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే పరీక్షల >>2

# ముంచేస్తున్న 'గాలి'
### 2030 నాటికి 76 నగరాల్లో భారీగా పెరగనున్న వాయు కాలుష్యం



**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** దేశంలోని 76 నగరాల్లో వాయు కాలుష్యంపై సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సిఎస్‌టిఇపి) కాలక అధ్యయనం నిర్వహించింది. ఇందులో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ నిర్దేశించిన లక్ష్యాల్లో కొన్ని నగరాలు మాత్రమే రాబోయే కాలంలో టార్గెట్‌ను అందుకునే అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. 2019లో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. జాతీయ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా లేని 131 నగరాల్లో గాలి నాణ్యతను మెరుగుపరచడమే దీని లక్ష్యం. 2030 నాటికి కేవలం ఎనిమిది నగరాలు మాత్రమే ఉద్గారాలను 40 శాతం తగ్గించగలవని రెండున్నరేళ్లపాటు నిర్వహించిన అధ్యయంలో తేలింది. అంతేకాదు 2019తో పోలిస్తే 2030 నాటికి ఆయా నగరాల్లో ఉద్గారాలు 11 నుంచి 45 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఆయా నగరాల్లో గాలి నాణ్యత పిఎం 10, పిఎం 2.5, ఎస్ఒ 2, ఎస్ఒ ఎక్స్ అనే నాలుగు నిర్దిష్ట కాలుష్య కారకాలను దృష్టిలో పెట్టుకొని అధ్యయనం నిర్వహించింది. 2019ని ఆధార సంవత్సరంగా తీసుకొని 2030 నాటికి కాలుష్య కారకాలు ఎంతవరకు >>2

## 25 మంది నక్సల్స్ లొంగుబాటు

**బీజాపూర్, ఆగస్టు 26:** ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్‌జిల్లాలోపెద్ద సంఖ్యలోనక్సలైట్లు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో ఐదుగురిపై మొత్తంగా 28 లక్షల రూపాయల రివార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు)కు చెందిన వీరంతా గంగ్లూర్, బైరామ్‌గఢ్ ఏరియా కమిటీల్లోక్రియాశీలకంగాపనిచేసేవారని వీరిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నట్లు బిజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్‌యాదవ్ తెలిపారు. శంబటిమద్కం(23), జ్యోతి పునెం(27) మహేశ్ తేలంపై ఒక్కొక్కరి తలపై రూ.8 లక్షలచొప్పున రివార్డు ఉందన్నారు. శంబటి అనే మహిళ 2012నుంచి ఉద్యమంలోచురుగ్గా ఉండేవారని 2020లో సుక్మా జిల్లాలో 2021లో బిజాపూర్‌లో భద్రతా సిబ్బందిపై జరిగిన భారీ దాడుల ఘటనల్లోఆమెపాత్ర ఉందని తెలిపారు. విష్ణుకర్తమ్ అలియాస్‌మోను, జైదేవ్ పొడియంలపైనా రివార్డు ఉందన్నారు. మావోయిస్టుభావజాలంపట్ల నిరాశ ఉద్యమనేతల దౌర్జన్యాలను ఎత్తిచూపుతూ వారు లొంగిపోయినట్లు ఎస్పీ తెలిపారు.తమ ఎదుట >>2



# జూరాల 24 గేట్ల ద్వారా నీటి విడుదల

సోమవారం జూరాల నుంచి శ్రీశైలానికి విడుదలవుతున్న నీరు

### నారాయణపూర్ నుంచి 1.30లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 26, ప్రభాతవార్త:** కర్ణాటకలోని కృష్ణా పరివాహక ప్రాంతంలో వర్షాల కారణంగా ప్రాజెక్టులకు స్వల్పంగా వరద పెరిగింది. సోమవారం సాయంత్రం 6గంటల వరకు అందిన సమాచారం మేరకు జూరాలకు 93,000 క్యూసెక్కుల వరద చేరగా 24గేట్లు ఎత్తి స్పిల్ వే ద్వారా 95,064 క్యూసెక్కులు, పవర్ హౌజ్ ద్వారా 31వేల689క్యూసెక్కులు దిగువకు వదిలారు. జూరాలలో పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 7.855టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఎగువ, దిగువ జూరాల జల విద్యుత్ కేంద్రాల్లోని విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతున్నది. జూరాల ఎడమ కాలువకు 820క్యూసెక్కులు, కుడి కాలువకు 496, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100, నెట్టెంపాడుకు 750, కోయిల్‌సాగర్‌కు 315క్యూసెక్కులు విడుదల చేశారు. జూరాల నుంచి మొత్తంగా 1,29,228 క్యూసెక్కులు అవట్‌ఫ్లో నమోదైంది. అలాగే కర్ణాటకలోని నారాయణపూర్ >>2



సోమవారం హైదరాబాద్ ఐఐటిలో డ్రైవర్ రహిత కారులో ప్రయాణిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

## హైదరాబాద్‌లో డ్రైవర్ లెస్ కారు
### ప్రయాణించిన మంత్రి శ్రీధర్‌బాబు

**సంగారెడ్డిబ్యూరో ఆగస్టు 26 ,ప్రభాతవార్త:** సంగారెడ్డి సమీపంలోని ఐఐటిహైదరాబాద్ క్యాంపస్‌ను సోమవారం రాష్ట్ర ఐటి మంత్రి డి.శ్రీధర్‌బాబు సందర్శించారు. టిహాన్ వేదికగా జపాన్‌కు చెందిన సుజుకి కంపెని, ఐఐటి హైదరాబాద్ సంయుక్తం సహకారంతో తయరు చేసిన డ్రైవర్ రహిత నాలుగు చక్రాల వాహనంను ఐఐటిహెచ్ డైరెక్టర్ మూర్తి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ప్రొఫెసర్ రాజ్యలక్ష్మిలతో కలిసి, మంత్రి శ్రీధర్‌బాబు పరిశీలించారు. తయారు చేయడానికి అనుసరించిన విధానంను అధికారులు మంత్రికి వివరించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు, ఐఐటిహెచ్ డైరెక్టర్ మూర్తి, జగ్గారెడ్డి, ప్రొఫెసర్ రాజ్యలక్ష్మిలతో కలిసి డ్రైవర్ రహిత వాహనంలో కొంత దూరం ప్రయాణించారు. ఈసందర్భంగా క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ >>2

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం : fb.com/vaartha
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem,Srikakulam
28-8-2024 బుధవారం సంపుటి: 30 సంచిక: 210 పేజీలు: 8+16 వెల: 6.50



ఇద్దరు తెలంగాణ టీచర్లకు జాతీయ అవార్డు 6

12 మంది ఏకగ్రీవంతో రాజ్యసభలో పెరిగిన ఎన్డీయే బలం 7


## తీహార్ జైలు నుంచి
# కవిత విడుదల

**శరతులతో కూడిన బెయిలు మంజూరు చేసిన సుప్రీం కోర్టు**

**ఢిల్లీ లిక్కర్‌స్కాంలో ఐదున్నర నెలలుగా జైల్లోనే కవిత**

**నేడు ట్రయల్ కోర్టు విచారణ అనంతరం హైదరాబాద్ రాక**



మంగళవారం రాత్రి జైలు నుంచి విడుదలై వచ్చిన కవితను ఓదార్చుతున్న భర్త, పక్కన కెటిఆర్

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేనిన ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్టయి ఐదున్నర నెలలుగా తీహాడ్ జైల్లో వున్న బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవితకు ఎట్టకేలకు బెయిల్ మంజూరయ్యింది. కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను మంగళవారం నాడు విచారించిన సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం ఆమెకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కాగా కవితకు బెయిల్ లభించడంతో ఢిల్లీలో మకాం వేసిన బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు కెటిఆర్, హరీష్ రావు తదితరులు, తెలంగాణలో బిఆర్ఎస్ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బెయిల్‌కు సంబంధించిన

>>2

## అందరికి వడ్డీతో చెల్లిస్తా

**అసలే మొండిని.. జగమొండిని చేశారు..**

**జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం కవిత**

2



మంగళవారం 'స్పీడ్' సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రి దామోదర

## గోషామహల్‌లో కొత్త
# 'ఉస్మానియా'

**32 ఎకరాల్లో ఆసుపత్రి నిర్మాణానికి నిర్ణయం**

**22 జిల్లాల్లో సమాఖ్య భవనాలకు స్థలం కేటాయింపు**

**వచ్చే యేడాదిలోగా 15 కొత్త నర్సింగ్ కాలేజి భవనాలు**

**'స్పీడ్' సమీక్షలో సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు27:** హైదరాబాద్‌లోని గోషామహల్‌లో ఉస్మానియా హాస్పిటల్ కొత్త భవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని చెప్పారు. గోషామహల్‌లోని పోలీస్ స్టేడియం,పోలీస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, దాదాపు 32 ఎకరాల స్థలముందని, ప్రస్తుతం పోలీస్ విభాగం ఆధ్వర్యంలోఉన్న ఈస్థలాన్ని వెంటనేవైద్య ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. అక్కడే ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా ఎంచుకున్న స్పీడ్(స్మార్ట్ ప్రోయాక్టివ్ ఎఫిషియెంట్ అండ్ ఎఫెక్టివ్ డెలివరీ) ప్రణాళికలో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం సచివాలయంలో తొలి సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ ప్రధాన



ఉస్మానియా ఆసుపత్రి పాత భవనం

కార్యదర్శి శాంతికుమారి,ఇతర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. స్పీడ్ జాబితాలో ఉన్న 19 పనుల్లో ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణం,15 కొత్త నర్సింగ్ కాలేజీలు,28 కొత్త పారామెడికల్ కాలేజీలు,జిల్లాల్లో సమాఖ్య భవనాల నిర్మాణాలకు సంబంధించిన ప్రణాళికలను ముఖ్యమంత్రి చర్చించారు. రాబోయే 50 ఏళ్ల అవసరాలను అంచనా వేసుకొని, కొత్త ఆసుపత్రి నిర్మాణ డిజైన్లు ఉండాలని సిఎం అధికారులను అప్రమత్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అక్కడికి చేరుకునే కనెక్టివిటీ రోడ్లను అభివృద్ధి చేయాలని,ఆసుపత్రి చుట్టూరా నలుదిశలా రోడ్లు ఉండేలా డిజైన్ చేయాలని చెప్పారు. ఆసుపత్రికి అవసరమైన అన్ని విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించాలని ఆదేశించారు. కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు,సేవలన్నీ అక్కడే అందుబాటులో ఉండాలని సూచించారు.కేవలం కాంక్రీట్ భవంతులు,బహుళ అంతస్తులు కాకుండా ఆహ్లాదకరమైన విశాల మైన ఖాళీ ప్రాంగణం ఎక్కువగా ఉండేలా డిజైన్లు ఉండాలని సూచించారు.ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించి అనుభవజ్ఞులైన ఆర్కిటెక్ట్‌లతో డిజైన్‌లను తయారు చేయించాలని అన్నారు. ఇప్పుడున్న ఉస్మానియా హాస్పిటల్ భవనాలను చారిత్రక

>>2

## సెప్టెంబర్ 17 నుంచి
# 'ప్రజాపాలన'

**10 రోజుల కార్యక్రమం**

**సీజినల్ వ్యాధులపై అప్రమత్తం,**

**ఆరోగ్యంతో చెలగాటమాడితే సస్పెన్షన్**

**రేషన్, హెల్త్‌కార్డులు లింక్ లేకుండా జారీ**

**మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి సిఎం రేవంత్ సమీక్ష**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు27:** సీజినల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డెంగ్యూ,చికెన్‌గున్యా,వైరల్ జ్వరాలతో వివిధ ఆసుపత్రుల్లో పెరుగుతున్న కేసులపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధులు రాకముందే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్,స్ప్రే ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రి

>>2



మంగళవారం యాదాద్రిలో అఖండ జ్యోతి దీపారాధన చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## యాదాద్రీశుని దర్శించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**యాదగిరిగుట్ట ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ అన్నారు. మంగళవారం ఉదయం గవర్నర్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అంతకుముందు రాష్ట్ర గవర్నర్‌కు ప్రభుత్వ విఫ్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, రాష్ట్ర దేవాదాయ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖల కమీషనర్ ఎం.హనుమంతరావు, జిల్లా కలెక్టర్ హనుమంత్ కే.జెండగే, డిప్యూటీ పోలీసు కమీషనర్ రాజేష్ చంద్ర, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్ గవర్నర్‌కు పూల

>>2

# చేజారుతున్న పదవులు!

**నామినేటెడ్ పదవుల కోసం తెగని నిరీక్షణ**

**వాటి బాధ్యత స్వీకరణకు హైకమాండ్ 'నో'**

**అనిశ్చితిలో పోచారం, గుత్తా అమిత్**

**కార్యకర్తలకు అనుగుణంగా అధిష్ఠానం నిర్ణయం**

**హైదరాబాద్, ఆగస్టు 27,ప్రభాతవార్త:** భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నామినేటెడ్ పదవుల తాయిలాల ప్రలోభాలకు లొంగి పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరినప్పటికి నామినేటెడ్ పదవులు చేతి వరకు వచ్చి చేజారిపోతున్నాయి. నామినేటెడ్ పదవుల బాధ్యత స్వీకరణకు హైకమాండ్ నో అనడంతో వలసపక్షులు నిరాశకు గురవుతున్నారు. నామినేటెడ్ పదవుల ఉత్తర్వలు వెలువడి వారంరోజులు గడిచినా ఇంకా బాధ్యతలు స్వీకరించడం లేదు. బాన్సువాడ ఎమ్మెల్యే మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి, పార్టీ ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరడం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కాంగ్రెస్ తో సన్నిహితంగా ఉంటూ ఆయన కుమారుడిని కి కాంగ్రెస్ తీర్థం ఇప్పించడం స్థానికంగా కాంగ్రెస్ శ్రేణుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోచారం శ్రీనివాసరెడ్డి కి వ్యవసాయ శాఖ సలహాదారుగా గుత్తా సుఖేందర్‌రెడ్డి కుమారుడు అమిత్‌రెడ్డికి తెలంగాణ డెయిరీ అభివృద్ధి సహకారకార సమాఖ్య చైర్మన్‌గా నియమించారు.దీనితో కాంగ్రెస్ పార్టీలో క్షేత్రస్థాయి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోన్నది.1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచిఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలు కొని తెలంగాణ ఏర్పాటు అనంతరం కూడా కాంగ్రెస్ పార్టీకి ఎన్ని ఒడిదొడుకలు వచ్చినా ప్రతిపక్షంలో కష్టకాలంలో పార్టీకి అండగా ఉంటూ సంస్థాగతంగా బలోపేతం చేస్తూ పలు మార్లు అధికారంలోకి రావడానికి కృషిచేసిన కార్యకర్తలు నాయకులను పక్కనబెట్టడం, కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవులు ఇవ్వడంపై తీవ్ర ఆగ్రహంతో కార్యకర్తలు ఉన్నారు. ముఖ్యంగా కొంత మంది నాయకులు టిడిపి, బిఆర్ఎస్‌లలోకాంగ్రెస్ వ్యతిరేకతనే పునాది చేసుకొని దశాబ్దలకాలంగా కాంగ్రెస్ కార్యకర్తలను వేధించిన వారు ఇప్పడు కాంగ్రెస్ పార్టీలో ముందువరసలో కూర్చొనడం నామినేటెడ్ పదవులు గద్దల్లా తన్నుకుపోవడం వారిని తీవ్రంగా వేధిస్తున్నది. బాన్సువాడలో పోచారం పార్టీలో చేరడంపై కాంగ్రెస్‌శ్రేణులు పల్లెగల్లీ నుంచి మొదలు కొని నియోజకవర్గం హెడ్‌క్వార్టర్‌వరకు తీవ్రంగా అసంతృప్తితో ఉన్నారు. గుత్తా అమిత్‌రెడ్డి నియామకంతో నల్ల గొండ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, శంకర్‌నాయక్‌లకు నిరాశ మిగిలిందని వారి కార్యకర్తలు ఆవేదన



>>7

## 'కాళేశ్వరం' దోషులకు
# శిక్షపడాల్సిందే

**అఫిడవిట్ దాఖలు చేసిన వి. ప్రకాష్‌రావు**

**బహిరంగ విచారణలో ఇంజనీర్ల పొంతనలేని సమాధానాలు**

**సిడిఓ మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లపై ఘోష్ ఆగ్రహం**

**హైదరాబాద్, ఆగస్టు 27,ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును బాధ్యతరాహిత్యంగా నిర్వహించిన అసలైన దోషులకు శిక్షపడాలని అనేది మా ఉద్దేశ్యమని జలవనరుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ అన్నారు. మంగళవారం బిఆర్‌కెభవన్‌లో పిసిఘోష్ ఎదుట మరోసారి జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ విప్రకాశ్ హాజరై ప్రాజెక్టు సంబంధించిన అంశాలపై అఫిడవిట్ దాఖలు చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కాళేశ్వరంపై కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ సలహాదారు వెదిర శ్రీరాం, విద్యుత్ నిపుణులు కె.రఘు తప్పుడు సమాచారంతో విచారణను తప్పుదోవపట్టించేలా అనేక అంశాలను వక్రీకరణచేశారని అఫిడవిట్‌లో పేర్కొన్నానని తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద జీవవైవిధ్యం కాపాడుకోవాల్సి ఉంటుందని అక్కడ ప్రాజెక్టు నిర్మాణం సాధ్యంకాదని అఫిడవిట్‌లో ఖరాఖండిగా పేర్కొన్నారు. కాళేశ్వరంపై కాగ్ ఆక్షేపణలు ఆర్థిక కోణంలో మాత్రమే సమర్థనీయం కానీ వాస్తవానికి జలమే నాగరికథకు పునాది నీటి కొరత కారణంగా ఇటీవల ఢిల్లీలో జరిగిన ఇబ్బందిని దృష్టిలో పెట్టుకొని కాస్ట్‌బెనిఫిట్ రేషియోతో ఈ అంశాన్ని ముడిపెట్టడం తగదని ఆయన తెలిపారు. అఫిడవిట్ పరిశీలన తరువాత మళ్ళీ జస్టిస్ తనకు సమన్ చేసే అవకాశం ఉందని అప్పుడు వస్తానని ఆయన తెలిపారు. మరోవైపు ఇదే రోజు సిడివో మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను పిసిఘోష్ విచారించారు. ఇంజనీర్లు జస్టిస్ అడిగిన ప్రశ్నలకు సంబంధంలేని అంశాలను తెలుపుతూ విచారణను పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. బ్యారేజిల డిజైన్లలో మార్పులు చేర్పులపై కమీషన్ ప్రశ్నించగా నిబంధనలు అనుగుణంగా చేశామని వారు తెలిపారు. డిజైన్‌కు అనుమతి వచ్చినాకే ప్రాజెక్టు నిర్మాణ స్థలం మార్పు జరిగినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు మేడిగడ్డ బ్యారేజి నిర్మిత ప్రాంతం ముందుగానే ప్రతిపాదించిన చోటు జరిగిందని వారు స్పష్టంచేశారు.హైపవర్ కమిటీ నిబంధనల ప్రకారం డిజైన్లు చేశామని తెలిపారు. సిడివో,ఎల్అండ్ టి వేరువేరుగా డిజైన్లు చేశాయని తుది ఆమోదం అన్ని కలిసి చర్చించి తీసుకొన్నామని తెలిపారు. మూడు బ్యారేజిల డిజైన్లలో ఏలాంటి సమస్యలు లేవని నిబంధనల ప్రకారం డిజైన్లు ఉన్నాయని ఇంజనీర్లు తెలిపారు. కమీషన్ వేసిన ప్రశ్నలకు ఎదురు ప్రశ్నలు వేయడంతోపాటు పొంతనలేని సమాధానాలు చెబుతూ ఐదుగురు ఇంజనీర్లు చీవాట్లు తిన్నారు.

## ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీల్లోనూ స్పాట్ అడ్మిషన్లు

**నేడు నోటిఫికేషన్ జారీ.. 29న పత్రికల్లో నోటిఫికేషన్**

**30 నుంచి సెప్టెంబర్ 2 వరకు స్పాట్ అడ్మిషన్లు**

7



## రాజ్యసభకు అభిషేక్ సింఘ్వీ ఏకగ్రీవం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు27:** తెలంగాణలో రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ ఉపసంహరణకు గడువు ముగిసింది. రాజ్యసభ సభ్యర్థిత్వానికి కాంగ్రెస్ నుంచి అభిషేక్ మనుసింఘ్వీ,ఇండిపెండెంట్‌గా పద్మరాజన్ నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు బలపరకపోవడంతో పద్మరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. దీంతో రాజ్యసభ సభ్యుడిగా సింఘ్వీ ఎన్నిక ఏకగ్రీవమైంది. మొత్తంగా రాజ్యసభ సభ్యుడిగా

>>2

# హైడ్రా విధ్వంసకారి కాదు

**ఆక్రమణలు సహించదు**

**చట్టం అందరికీ సమానమే**

**చెరువులు కబ్జా చేసి కట్టిన నిర్మాణాలపైనే మాదృష్టి**

**మొదటగా ఎఫ్‌టిఎల్..ఆతర్వాత బఫర్‌జోన్**

**విద్యాసంస్థల నిర్మాణంపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలిస్తున్నాం**

**కబ్జాదారులకు సహకరించే అధికారులపైనా చర్యలు తప్పవు: హైడ్రా కమిషనర్ ఎ.వి రంగనాథ్**



హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్

**హైదరాబాద్, ఆగస్టు 27,ప్రభాతవార్త:** ప్రస్తుతం హైదరాబాద్‌లో హాట్ టాపిక్‌గా ఏదైనా ఉందంటే అది హైడ్రా కూల్చివేతలే..ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ పరిధిలో అక్రమంగా నిర్మించిన కట్టడానలను నిర్దాక్షణంగా కూల్చేస్తున్నారు హైడ్రా అధికారులు.. రాజకీయ నాయకులు, సినిమా ప్రముఖుల ఫామ్‌హౌజ్‌లు, ఫంక్షన్ హాళ్లు కూల్చేస్తుండటం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో కూల్చివేతలపై వివిధరకాల విమర్శలు వస్తున్నప్పటికీ ఎలాంటిరాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ధైర్యంగా అక్రమ కట్టడాలపై బుల్డోజర్లను ప్రయోగిస్తున్నారు. ఈసందర్భంగా పలువురు కబ్జా దారుల్లో రైళ్లు పడుగెడుతుండగా..అదేసమయంలో చెరువుల సమీపంలో తెలిసి తెలియక భూమి కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నపేద, మధ్యతరగతి కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. ఈనేపథ్యంలో కూల్చివేతల సందర్భంగా ఎదురవుతున్న అడ్డంకులు,భవిష్యత్‌లో తీసుకోబోతున్న చర్యలు...ప్రజలకు హైడ్రా ఇచ్చే సూచనలపై కమిషనర్ రంగనాథ్‌తో ప్రభాత వార్త ప్రతినిధి ప్రత్యేక కథనం.. నీటివనరుల సంరక్షణకు మూడంచెల కార్యాచరణ అమలుచేస్తున్నాం. మొదటిదశలో పూర్తిస్థాయి నీటి మట్టం, బఫర్ జోన్లలో కొత్త నిర్మాణాలు అడ్డుకోవడం, కబ్జాదారుల విషయంలో కఠినంగా వ్యవహరించడం ఉంటాయి. రెండో దశలో ఇప్పటికే కట్టిన

>>2

## నేడు సచివాలయంలో 'తెలంగాణ తల్లి'కి భూమి పూజ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు27:** బిఆర్ అంబేడ్కర్ సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు భూమి పూజ చేయనున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. ఇప్పటికే తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కోసం సెక్రటేరియట్‌లో సిఎం చూపిన ప్రదేశంలోనే ఈ విగ్రహావిష్కరణ జరుగనుంది. సచివాలయం ఆవరణలో భవన ప్రధానద్వారా ముందు భాగంగా విగ్రహ ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా

>>2

వార్త

నిరంతరం నిన్ను ఎవరో కనిపెట్టి చూస్తున్నారన్న స్పృహతో నీవు ప్రవర్తించు.

-ఎమర్సన్

# సూత్రధారులే మూలం!


ఎన్ని చట్టాలు చేసినా, ఎంతమంది అధికారులను నియమించినా, మరెన్నిసార్లు హెచ్చరించినా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎర్ర చందనం దుంగల స్మగ్లింగ్‌ను నియంత్రించలేకపోతున్నారు. అరుదైన, ప్రపంచంలో ఎక్కడా దొరకని ఎర్ర చందం వృక్షసంపదను కాపాడేందుకు పాలక పెద్దలు తీసుకుంటున్న చర్యలు ఏమాత్రం ఫలితాలు ఇవ్వలేకపోతున్నాయి. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. అవసరమైన అన్ని హంగులు కల్పించారు. ప్రాణాలకు తెగించి ఆ సిబ్బంది రాత్రింబవళ్లు ఆ వృక్షసంపదను కాపాడేందుకు కృషి చేస్తున్నారు. పదుల సంఖ్యలో స్మగ్లర్లు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేతిలో మరణించినా ఏమాత్రం వెలువడడం లేదు. కొన్ని సందర్భాల్లో సిబ్బందిపై దాడులకు చివరకు చంపడానికి కూడా స్మగ్లర్లు వెనుకాడడం లేదు. ఇందుకు వారు తుపాకులువంటి మారణాయుధాలను కూడా వాడుతున్న విషయం వారివద్ద నుండి స్వాధీనం చేసుకుంటున్న తుపాకులే సజీవ సాక్ష్యం. ఈ యేడాది ఫిబ్రవరిలో ఎర్రచందనం తరలిస్తున్న ఒక కారును కానిస్టేబుల్ ఆపే ప్రయత్నం చేయడంతో తొక్కించుకుంటూ స్మగ్లర్లు వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడ్డ కానిస్టేబుల్‌ను ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగానే మరణించాడు. అయితే సహచర ఉద్యోగులు ఢీకొట్టి పారిపోతున్న వాహనాన్ని వెంబడించి కొంతదూరం వెళ్లిన తర్వాత పట్టుకోగలిగారు. అందులో ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి సంఘటనలు తరుచుగా జరుగుతున్నాయి. నిందితులను తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. గత మూడు, నాలుగు దశాబ్దాలుగా అత్యంత విలువైన ఈవృక్ష సంపద తరలిపోతూనే ఉన్నది. ప్రతిసారి కూలి కోసం వచ్చి ఎర్రచందనం చెట్లను కూలగొడుతున్నకూలీలే పట్టుబడుతున్నారు తప్పవారి వెనుక ఉన్న పెద్దల హస్తం వెలుగుచూడడం లేదు. ఆ ప్రాంతంలో ఎవరిని అడిగినా ఎర్రచందనం స్మగ్లింగ్ వెనుక పాత్ర ఎవరెవరిది ఉందో కథలుకథలుగా చెప్తారు. అయినా పాలక పెద్దలు ఆవైపు దృష్టిసారించకుండా మూలాల్లోకి వెళ్లకుండా ఈ అక్రమ స్మగ్లింగ్‌ను నిరోధించేందుకు ప్రయత్నం చేయడం ప్రయోజనం లేకుండాపోతున్నది. ప్రపంచంలో ఎక్కడా దొరకని ఈ ఎర్రచందనం ఆంధ్రప్రదేశ్‌లో కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో మాత్రమే ఈ వృక్షసంపద విస్తరించి ఉంది. వీటిని 1973లో అరుదైన వృక్షాల జాబితా సైట్స్ (కన్వెన్షన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడింగ్ ఎన్‌డేంజర్డ్ స్పైస్)లోకి చేర్చారు. ఆనాటి నుంచి ఎర్రచందం దుంగలు ఎగుమతిపై నిషేధం అమలులోకి వచ్చింది. కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈవృక్షాలను సంరక్షించేందుకు పాలకులు పటిష్టమైన చర్యలే తీసుకున్నారు. వాస్తవంగా చూస్తే ఈ ఎర్రచందనానికి భారత్‌లో పెద్ద గిరాకీలేదు. మార్కెట్ కూడా లేదని చెప్పొచ్చు. జపాన్, చైనా దేశాల్లో ఊహించని రీతిలో డిమాండ్ ఉంది. అది అంతకంతకు పెరుగుతుండడం కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండడం ఎర్రచందనాన్ని స్మగ్లర్లు అక్రమంగా విదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్రమార్గాల ద్వారా దేశ సరిహద్దులను దాటించేందుకు ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలను అనుసరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయోత్పత్తుల పేరుతో బోగస్ అనుమతులు కూడా పొందుతున్నారు. చెన్నై, ముంబయి, కొచ్చి తదితర రేవుల నుంచి సరుకు రవాణా ఓడల ద్వారా తరలిపోతున్నది. రోడ్డు మార్గాలను కూడా వదిలిపెట్టడం లేదు. ఢిల్లీ, చండీఘడ్ గోదాముల్లో దాచిన సరుకును ఒక వ్యూహం ప్రకారం నేపాలకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి చైనాకు రవాణా అవుతున్నది. ఇదే కాదు మణిపూర్, మిజోరం రాష్ట్రాల నుంచి కూడా ఈ రవాణా యధేచ్ఛగా జరుగుతున్నట్లు సమాచారం. ఈచెట్లు కేవలం వెలుగొండ, శేషాచలం అడవుల్లో మాత్రమే పెరగడానికి కారణం ఏమిటో ఇప్పటికీ మన శాస్త్రవేత్తలు కనుక్కోలేకపోతున్నారు. 1700 సంవత్సరంలో బ్రిటిష్ శాస్త్రవేత్తలు ఎర్రచందనం చెట్లను దేశంలోని వివిధ ప్రాంతాలకు చివరకు తమ దేశానికి కూడా తీసుకువెళ్లి పరీక్షలు జరిపారు. చెట్లు అనుకున్న రీతిలో పెరగడం లేదు. పెరిగినా నాణ్యత లభించడం లేదు. ఇక ఈ చెట్లకు ఇంత విలువ ఎందుకు వస్తున్నది? ఎందుకు ఉపయోగిస్తున్నారు? తదితర విషయాల్లో ఇప్పటికీ స్పష్టత లేదు. సంగీత పరికరాలకు, ఆటంబాంబుల కోసం జపాన్ వీటిని కొంటున్నదని ప్రచారం జరిగినా ఆ తర్వాత తప్పని తేలిపోయింది. అణుఇంధన తయారీలోనూ, శృంగార సామాగ్రి తయారీలోనూ వీటిని వాడుతున్నట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. అటు జపాన్ కానీ, ఇటు చైనా కానీ తాము వాటిని ఎందుకు కొంటున్నామో, ఎందుకు ఉపయోగిస్తున్నామో తదితర అంశాలు ఏవీ బయటకు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. అంతర్జాతీయ బయోడైవర్సిటీ సంస్థ అధ్యయనం ప్రకారం ఒక టన్ను ఎర్రచందనానికి ఆరేడు కోట్ల రూపాయల వరకు ధరపలుకుతుందని చెప్తారు. అందుకే రాయలసీమలోని కొన్ని మాఫీయా ముఠాలు కొందరు ఫ్యాక్షన్‌నేతలు, మరికొందరు రాజకీయ నాయకులు ఎర్రచందనం స్మగ్లింగ్‌ను తమ వ్యాపకంగా మార్చుకున్నారు. దీనికితోడు అటవీ పోలీసుశాఖ సిబ్బంది, అధికారుల్లో కొందరు వారితో చేతులు కలుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. చట్టాల్లోనిలోపాలు, లొసుగులుకూడా స్మగ్లర్ల పాలిటవరంగా మారుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి. కడుపు కూటికోసం ఈ చెట్లను కూల్చేందుకు వస్తున్న కూలీలు పాత్రధారులే. వీరివెనుక ఉన్న సూత్రధారులను బయటకు తీసి మూలాలపై చర్యలు తీసుకుంటేనే ఈ స్మగ్లింగ్ ఆగుతుంది.

తెలివిగల వ్యక్తికి తప్పనిసరిగా ఎల్లప్పుడూ ఉండే లక్షణం ప్రతి విషయాన్ని తెలుసుకోవాలనే ఆతృత.




-శామ్యూల్‌జాన్సన్

ధనం ఉండి మిత్రులను సంపాదించడం సులభం. అది లేకుండా మిత్రులను కలిగి ఉండటం గొప్పతనం.



-బర్ట్రండ్ రస్సెల్

## ప్రజావాక్కు



### అప్పరహిత భారత్ సాధ్యమేనా?

ఒక్కమాటలో నిర్భయంగా చెప్పాలంటే అప్పు చేయనిది ఉప్పులేని పప్పుకూడు కూడా పుట్టదు. ఒక్కపూట కూడా గడవదు గాక గడవదు అన్న విధంగా ఉంది నేడు మన భారతదేశ ఆర్థికవ్యవస్థ తీరుతెన్నులు. ఎందుకంటే 2014లో ఎన్డీయే అధికారంలోకి వచ్చేసరికి భారతదేశ అప్పు 45లక్షల కోట్లు. ప్రస్తుతం మనదేశం అప్పు దాదాపు ట్రిబుల్ అంటే 120 లక్షల కోట్లు దాటింది. ఇక 70 యేళ్లకు 45 లక్షల కోట్లు అయితే కేవలం ఏడేళ్లలో 75 లక్షల కోట్లు అయింది. ప్రతిరోజు 500 కోట్లు అప్పు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, వంట గ్యాస్ సిలిండర్ల ధరలు ఆకాశాన్ని అంటడం, ప్రభుత్వ ఆస్తులఅమ్మకం ఈ డబ్బంతా ఎక్కడికిపోతుంది అనేది సమాధానం లేని మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మిగిలిపోతున్నది.

-బుగ్గన మధుసూదనరెడ్డి, బేతంచెర్ల, నంద్యాలజిల్లా

### హామీలను అమలుపరచండి

మేము అధికారంలోకి రాగానే రైతులకు రెండు లక్షల రూపాయలవరకుక్రాఫ్‌ఎలోను మాఫీచేస్తామని ఎన్నికలకు ముందు వరంగల్ సభలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ పథకాన్ని ప్రకటించడంతోపాటు, ఎన్నికల ప్రకారంలోరేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9తారీఖు రైతులందరికి ఒకే దఫాలో రెండులక్షల రుణ మాఫీ చేస్తామని ప్రకటించినందుకు రైతులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల తర్వాత రుణమాఫీకి శ్రీకారం చుట్టిన రేవంత్‌రెడ్డి 2018డిసెంబర్ నుండే రుణమాఫీ అంటూ సన్నాయినొక్కులు నొక్కడంతో అంతకుముందు బిఆర్‌ఎస్‌పార్టీ హయాంలో రుణమాఫీ అమలుకానీ రైతులను ప్రస్తుత ప్రభుత్వం ముంచిందని విమర్శలు చేస్తున్నారు.

-బూర్గుపల్లి కృష్ణయాదవ్, హైదరాబాద్

### రైతు ప్రభుత్వం

దేశవ్యాప్తంగా వేలాది మంది మానసిక క్షోభకు వందలాది మంది రైతుల మరణాలకు కారణం అవటం తప్ప బిజెపి రైతులకి చేసిందేమీ లేదు. ఇప్పుడు తెలంగాణ రైతుల కోసం పోరాటాలు చేస్తామంటున్నారు. వారి కోసం ఎలాంటి త్యాగాలు చేయడానికైనా సిద్ధమంటున్నారు. అంతా బూటకం. రైతులు వీరిని నమ్మరు.

-మిథునం, హైదరాబాద్

### అభివృద్ధికి మరో కోణం

మొన్న ఆంధ్రప్రదేశ్‌లో ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. అందులో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది ఎంతో దురదృష్టకరం. ఇది మరవకముందే మరో పేలుడు సంభవించింది. ఇది ముమ్మాటికీ ఫ్యాక్టరీ యాజమానుల నిర్లక్ష్యమే. గత ప్రభుత్వంయెడాపెడా ఫ్యాక్టరీలకు అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వంఅన్నిపరిశ్రమలో ముమ్మర తనిఖీలుచేపట్టాలి. కేవలం పరిశ్రమలతోనే అభివృద్ధి జరుగుతుంది అనిభావించే ఏ రాష్ట్రంలోనైనా ఇటువంటి సంఘటనలు మరో కోణాన్ని చూపిస్తాయి.

-శ్రిష్టి శేషగిరి, సికింద్రాబాద్

### పొరుగుసేవల సిబ్బందికి న్యాయం చేయాలి

ప్రభుత్వ యంత్రాంగంలో కీలకంగా వ్యవహరిస్తున్న పొరుగు సేవల సిబ్బందికి ఏళ్లతరబడి వేతనాల విషయంలో అన్యాయం జరుగుతుంది. అతి తక్కువ జీతాలతో ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న ఈసిబ్బందిపై ప్రభుత్వం దయచూపాలని కోరుతున్నారు. కనీస వేతన ఫార్ములాని అమలుపరిచి సిబ్బందికి న్యాయం చేయవలసిన అవసరం ఉంది. ప్రస్తుత కాలంలో ఒక సాధారణ కుటుంబం బతకడానికి కావలసిన కనీస అవసరాలను, ఆర్థికసూచీని ఆధారం చేసుకొని వేతనాలను కనీసం 28వేల నుంచి 35వేల వరకు పెంచవలసిన అవసరం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు అన్ని శాఖల్లో కూడా పొరుగు సేవలు సిబ్బంది రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారు.

-బడగల సురేష్, శ్రీకాకుళంజిల్లా

### దేవాలయాల భూములను కాపాడాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక దేవాలయాల భూములు అక్రమంగా ఆక్రమించబడి, అనవసరమైన నిర్మాణాలకు ఉపయోగపడుతున్నాయి. ఈకారణంగా దేవాలయాలు తమ పూజా కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించలేకపోతున్నాయి. భూముల ఆక్రమణలను నివారించేందుకు కఠినమైన చర్యలు తీసుకోవాలి. భూముల రక్షణ కోసం ముఖ్యమైన చట్టాలు, నిబంధనలు ఉండాలి. ఇలాంటి చట్టాలు రూపొందించి, వాటిని కఠినంగా అమలు చేయడం అవసరం. దేవాలయాల భూములను కాపాడేందుకు ప్రత్యేక ఆర్డినెన్స్‌లు కూడారూపొందించాలి. దేవాలయాల భూముల రక్షణకు ప్రజల సహకారం చాలా ముఖ్యం. దేవాలయాలు, వారి నిర్వాహకులు, స్థానిక ప్రజలు కలిసి పనిచేస్తే, భూముల పరిరక్షణ సాధ్యమవుతుంది.

-అప్పన్న గొనప, విశాఖపట్నం

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail: editpage@vaartha.com


# ఉక్రెయిన్, రష్యా పోరుతో ప్రపంచ శాంతికి ముప్పు!

*మొదట హసీనా బంగ్లాదేశ రాజకీయ అస్థిరత ఏవిధంగా మారుతుందో అంచనా లేకుండా, ఉక్రెయిన్, రష్యా సంఘర్షణలలో తలదూర్చటం ఎంతవరకు సబబు? కచ్చితంగా ప్రధాని ఈ విషయాలన్నీ కూలంకషంగా ఆలోచించి కానీ మరో దేశ సమస్య ప్రాధాన్యత అంచనాలలోకి పోలేరు. ఇరుపక్షాల నాయకులు ఉక్రెయిన్‌లో దాదాపు రెండున్నర గంటలు చర్చించిన తర్వాత కూడా ఏవిధంగా ఈ దాడులను ఆపాలి. సంఘర్షణలను ఏవిధంగా సమిసిపోయేట్లు చేయాలి అన్న విషయంలో నిర్దిష్టంగా ఏ అభిప్రాయానికి రాలేకపోయారు. జయశంకర్ మనదేశ విదేశాంగ మంత్రి ఈ సమస్య పరిష్కారానికి అనేక మార్గాలు ఉన్నాయి, చర్చల ద్వారా, దౌత్యపరంగా, అంతర్జాతీయ చట్టాల ననుసరించి ఈ సంఘర్షణలను ఆపే ప్రయత్నం చేయక తప్పదు' అని అభిప్రాయపడ్డారు. రష్యా ఉక్రెయిన్ సమస్యకుతోడు అంతర్జాతీయంగా బంగ్లా సమస్య కూడా ఏర్పడటం గ్లోబల్ శాంతికి ప్రమాదమే!.*



రావులపాటి సీతారాంరావు

ఇండియా 'న్యూట్రల్' కాదు'శాంతి' వైపు ఉంటుంది అన్న ఒక్క సౌక్యంతో ప్రధాని మోడీ ఉక్రెయిన్ ప్రసిడెంట్ జెలెన్స్కీతో మనదేశం విదేశాంగ విధానాన్ని చెప్పకనే చెప్పినట్లయింది. ఆ విధమైన విధానం పాటించడం ఎంతవరకు ఆచరణాత్మకంగా ఉండటంతోపాటు ఆమోదయోగ్యంగా ఉంటుందనేది భవిష్యత్తు నిర్ణయిస్తుంది. గ్లోబల్ ఆధిపత్యం కోరే చైనా ఈ విధానానికి ఎంతవరకు మనదేశానికి ఆచరణలో అడ్డుపడకుండా ఉంటుందో ముందు ముందు తెలుస్తుంది. రష్యాలో పర్యటించిన ఆరు వారాల తర్వాత మన ప్రధాని జెలెన్స్కీతో ఉక్రెయిన్ దేశంలో కలవటం విదేశాంగా విధానంలో 'బాలెన్సింగ్ యాక్ట్'గానే నిపుణులు చెప్పటంలో ఆశ్చర్యపడాల్సిన అవసరమేమీలేదు! ఫిబ్రవరి2022 సంవత్సరంలో రష్యా, ఉక్రెయిన్ దేశంలో యుద్ధం మొదలుపెట్టింది. ఇండియా ఈ రెండు దేశాలకూ ఆ విషయంలో సమాన దూరంలోనే ఉంది ఇంతవరకూ! యుఎస్‌ఓ తీర్మానాలు ముఖ్యంగా రష్యాను విమర్శించే విషయంలో చర్చకు వచ్చినప్పుడు ఇండియా పాల్గొనలేదు. పశ్చిమ దేశాలు రష్యా ఆయిల్ దిగుమతులు యుద్ధ పరికరాలు లాంటి వాటిపై సాంక్షన్లు విధించినప్పుడూ మౌనాన్నే పాటించింది. జి-20 సమ్మిట్‌లో గత సంవత్సరం తమదేశాన్ని చేర్చమని ఉక్రెయిన్ అడిగినప్పుడూ స్పందించలేదు. రష్యాకు సంబంధించినంతవరకూ ఉక్రెయిన్ విషయంలో ఇప్పటివరకూ ఆచితూచి అడుగేయడం నిస్సందేహంగా ఉక్రెయిన్‌కు నచ్చటం లేదు. ఈ విషయంలో ఇండియా మరింత చొరవ తీసుకొని రష్యా దాడులను అదుపులో ఉంచేందుకు ఉక్రెయిన్ సహకరించాలని కోరుతున్నందువల్ల ప్రధాని మోడీ రష్యా పర్యటనను కూడా స్వాగతించలేదు. అయితే 1991లో ఉక్రెయిన్ స్వాతంత్ర్య సముపార్జన తర్వాత ఇండియా ప్రధాని, మొదటి పర్యటన కావించటం ఒకవిధంగా గమనించదగ్గ పరిణామమే అని ఉక్రెయిన్ కూడా భావిస్తున్నది. ఈ పర్యటన ఇండియా పాలసీలో కొంత మార్పుకు దారితీస్తుందేమోనని కూడా ఆ దేశం ఆశాభావంతో ఉన్నది. పర్యటన దినాలు తక్కువే అయినా ఇరుదేశాల నాయకులు రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాల గురించి సంఘర్షణ గురించి మనసు విప్పి మాట్లాడుకోవటం జరిగిందని విదేశాంగ విధాన నిపుణులు ఒక అంచనాకు వచ్చారు. ఇద్దరు నాయకులు యుద్ధంలో చిన్న పిల్లల మృతి సందర్భంగా ఏర్పరిచన మెమోరియల్ సందర్శించి నివాళులు అర్పించారు. అయితే ఇతర విదేశీ నాయకులు 2022 నాటి నుంచి సందర్శించే విధంగా యుద్ధంలో చనిపోయిన వారి బంధువులను కానీ గాయ పడిన వారిని కానీ, సివిలియన్స్‌ను కానీ మోడీ కలిసే ప్రయత్నం చేయలేదు. ఇరుపక్షాలు మాత్రం నాలుగైదు ఒడంబడిక పత్రం మీద సంతకాలు చేశాయి. వ్యవసాయం, మెడికల్, కల్చర్, కమ్యూనిటీ అభివృద్ధికి తోడ్పాటులాంటి విషయాల్లో ఈ అగ్రిమెంట్లు జరిగాయి. మరింత లోతుగా మరిన్నిముఖ్య విషయాలు చర్చల్లో వచ్చినట్లుగా లేవు. స్ట్రాటజిక్ స్నేహం కానీ, టెలికాం, మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్‌లాంటివి ఉక్రెయిన్ రిక్వెస్ట్ చేసిన విషయాలు మాట్లాడుకోవడం జరుగలేదు. నవంబర్‌లో దేశ రాజధాని క్యైవ్‌లో సమ్మిట్ జరపాలని, అందులో ఇండియా చొరవతీసుకొని



ఈ సమస్యను ఒక కొలిక్కి తెచ్చేందుకు గణనీయమైన రోల్ పోషించే విషయంలో ప్రధాని మోడీ ఒక మార్గాన్ని చూపించాలని ఉక్రెయిన్ అభిలషిస్తున్నది. ప్రధాని మోడీ అంతర్జాతీయ స్థాయిలో పెద్ద నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రపంచదేశాల నాయకులలో వేళ్లమీద లెక్కపెట్టే ఇద్దరు ముగ్గురు నాయకులలో ఒకరుగా ఉన్నారు. శాంతి ప్రతిపాదనలు మోడీ అగ్రదేశాలకు సూచిస్తే కచ్చితంగా ఈ సంఘర్షణ సమిసిపోవడానికి అమెరికా, చైనా లాంటి దేశాలు కూడా కాదనలేని పరిస్థితి. గ్లోబల్ సౌత్‌కు సంబంధించిన అగ్రనాయకుడిగా మోడీచొరవ తీసుకోవటం కూడా ఇండియాకు లాభమేమో. యూరప్ దేశాలపై యుద్ధ నీలినీడలు తొలగిపోవటం వల్ల విధించిన సాంక్షన్లు తొలగిపోయే అవకాశం ఉంది. దానివల్ల అభివృద్ధి దిశలో నడుస్తున్న ఆసియా దేశాలకు అభివృద్ధి కుంటుపడకుండా ఆర్థికంగానే మేలు జరుగుతుంది. అయితే ఇండియా ఈ విషయంలో సంఘర్షణలో ఇరుక్కున దేశాలకు సందేశాలు పంపటం తప్ప పూర్తి చొరవతో పరిష్కారంలో భాగం కావాలనే దృక్పథాన్ని కనపర్చలేదు. ఇరుదేశాలు ప్రత్యక్షంగా చర్చలు చేయాలనే కోరికతోనే ఇండియా ఇప్పటి వరకూ ఉంది. ప్రధాని ఈ పర్యటన అందుకు దారితీస్తుందని అనుకున్నారు కానీ ఆ సంకేతాలు మనదేశం ఇవ్వలేదు. రష్యాకు అలాంటి మనదేశ వైఖరి ఊరటను కలిగిస్తే ఉక్రెయిన్‌కు నిరుత్సాహాన్ని కలిగిస్తుంది. అమెరికా, యూరప్ దేశాలు తమ చేతులలోంచి సమస్య పోకూడదనే ధోరణితోనే వ్యవహరిస్తున్నాయి. కానీ ఇండియా పరిష్కారం కోసం చొరవ ప్రదర్శించడం పెద్దగా ఆ దేశాలకు రుచించకపోవచ్చు. చైనా సరేసరి, రష్యాకు సహకరించటమే చైనా ప్రణాళికలో ఒక భాగం అని తెలుసు. బంగ్లాదేశ్ పరిణామాలతో ఇండియా విదేశాంగ విధానం, అంతర్జాతీయ విషయాలలో మరింత మెలుకువగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. హసీనా పదవీచ్యుతీ, ఆమె మనదేశానికి అకస్మాత్తుగా రావటం, విభ్రాంతి కలిగించిన సంఘటన. ఆ దేశంలో ఇప్పటికే భారతదేశం అంటే మండిపడుతున్న స్థితి. అక్కడి హిందువులకూ, మైనార్టీలకూ అత్యంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. వారికి మన పూర్తి సహాయ సహకారం ఇవ్వాల్సిన ప్రాథమిక బాధ్యతను కాదనలేనిస్థితి. ఇలాంటి పరిస్థితులలో శాంతి సందేహాలను ఇవ్వడం మినహా సంఘర్షణను పరిష్కరించే చొరవను భారతదేశం ఎలా తీసుకోగల్గుతుంది. అమీర్ ఖుస్రూ మొహమ్మద్ చౌదరి (బంగ్లాదేశ్ లోని హసీనా పార్టీకి వ్యతిరేక పార్టీ బి.యన్.పి ప్రముఖ నాయకుడు) ఇప్పటికే భారతదేశం బంగ్లా పాలసీ పూర్తిగా విఫలమైంది అని విమర్శిస్తున్నారు. రాజకీయంగా అస్థిరత ఆ దేశంలో ఏర్పడటానికి ఇండియా హసీనా బలాన్ని అంచనా వేయకుండా ఆమెనాయకత్వాన్ని బలపర్చటంవల్ల కూడా అని మనదేశాన్ని తప్పుపట్టున్నారు. ఆయన ఆ విధంగా విమర్శించడం భారతదేశం పట్టించుకోవాల్సిన అవసరం లేదు కానీ మొదట హసీనా బంగ్లాదేశ రాజకీయ అస్థిరత ఏవిధంగా మారుతుందో అంచనా లేకుండా, ఉక్రెయిన్, రష్యా సంఘర్షణలలో తలదూర్చటం ఎంతవరకు సబబు? కచ్చితంగా ప్రధాని ఈ విషయాలన్నీ కూలంకషంగా ఆలోచించి కానీ మరో దేశ సమస్య ప్రాధాన్యత అంచనాలలోకి పోలేరు. ఇరుపక్షాల నాయకులు ఉక్రెయిన్‌లో దాదాపు రెండున్నర గంటలు చర్చించిన తర్వాత కూడా ఏవిధంగా ఈ దాడులను ఆపాలి. సంఘర్షణలను ఏవిధంగా సమిసిపోయేట్లు చేయాలి అన్న విషయంలో నిర్దిష్టంగా ఏ అభిప్రాయానికి రాలేకపోయారు. జయశంకర్ మనదేశ విదేశాంగ మంత్రి ఈ సమస్య పరిష్కారానికి అనేక మార్గాలు ఉన్నాయి, చర్చల ద్వారా, దౌత్యపరంగా, అంతర్జాతీయ చట్టాల ననుసరించి ఈ సంఘర్షణలను ఆపే ప్రయత్నం చేయక తప్పదు' అని అభిప్రాయపడ్డారు. రష్యా ఉక్రెయిన్ సమస్యకు తోడు అంతర్జాతీయంగా బంగ్లా సమస్య కూడా ఏర్పడటం గ్లోబల్ శాంతికి ప్రమాదమే!. ●

# ఆహారంలో మైక్రోప్లాస్టిక్ కాలుష్యం

డాక్టర్ కృష్ణకుమార్ వేపకొమ్మ

ఇటీవల టాక్సిక్స్ లింక్ అనే పర్యావరణహిత సంస్థ విడుదల చేసిన మైక్రోప్లాస్టిక్స్ ఇన్ సాల్ట్ అండ్‌షుగర్' అధ్యయన నివేదికలో కొన్ని సంచలన విషయాలు బయటపడ్డాయి. భారతదేశంలో ఉత్పత్తి అవుతున్న ఉప్పు, చక్కెరలకు సంబంధించిన ప్రతిపరీక్ష నమూనాలలో సూక్ష్మ ప్లాస్టికలు ఉన్నాయని వివిధ జాతీయ మీడియా బృందాలు కూడా తమ నివేదికలో వారు ఆ అధ్యయన ఫలితాన్ని వెల్లడించారు. ఈ ప్రకటన అటు ప్రభుత్వాన్ని, ఇటు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈ సూక్ష్మప్లాస్టిక్‌ల ఉనికి ప్రజల ఆరోగ్యం, పర్యావరణ భద్రతల మీద ఎంతో ప్రభావాన్ని చూపుతాయని నిపుణులు భావిస్తున్నారు. భారతీయ కిచెన్‌లో ఉపయోగించే అత్యంత ముఖ్యమైన వస్తువుల్లో ఒకటి ఉప్పుకాగా, మరొకటి చక్కెర. ఈ రెండింటిలో మైక్రోప్లాస్టిక్ ఉన్నాయని తాజా నివేదిక తేల్చింది. ఈ మైక్రోప్లాస్టిక్ కణాలు 0.1 నుండి 5మిల్లీ మీటర్లు ఉండి, చిన్నా పెద్దా, ప్యాక్ట్ లేదా అన్‌ప్యాక్డ్ అనే తేడా లేకుండా ఇండియాలో అందుబాటులో ఉన్న అన్ని ఉప్పు, చక్కెర బ్రాండ్లలో ఈ మైక్రోప్లాస్టిక్ ఉన్నట్లు ఈ నివేదిక పేర్కొంది. టాక్సిక్ లింక్ సూచించిన ప్రకారం ప్రతిభారతీయుడు రోజుకు సగటున10.98 గ్రాముల ఉప్పు భుజిస్తున్నారని, ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫారసు చేసిన రోజుకు ఐదు గ్రాముల పరిమితికి రెట్టింపు భుజిస్తున్నారనీ మనకు తెలుస్తోంది. ఈ పరిశీలనలను బట్టి మనదేశంలో ప్రతివ్యక్తి రోజుకి సగటునసుమారు పదిస్పూన్ల చక్కెర వినియోగంతో, ప్రతిసంవత్సరం దాదాపు 18కిలోల చక్కెర భుజిస్తాడని వారి నివేదిక తేల్చి చెప్పింది. దీనిని



బట్టి చూస్తే మైక్రోప్లాస్టిక్‌లు మనకు తెలియకుండానే మన శరీరంలోకి ప్రవేశిస్తున్నాయని విశదమైంది. బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హాల్ పరిశోధకుల ప్రకారం అధిక స్థాయిలో మైక్రోప్లాస్టిక్స్ తీసుకోవడం మానవ కణాలపై మైక్రోప్లాస్టిక్స్ టాక్సికాలజికల్ ప్రభావాన్ని చూపి, కణనష్టం, వాపు, అలర్జీలకు దారితీయవచ్చు. చిన్న సైజుగల మైక్రోప్లాస్టిక్‌లు మెదడులోకి ప్రవేశించి ప్రవర్తనలో మార్పులకు దారితీస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. ఫుడ్‌అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ చక్కెర, ఉప్పులో మైక్రోప్లాస్టిక్‌ల ఉనికిని గుర్తించింది. ప్రపంచవ్యాప్తంగా మైక్రో ప్లాస్టిక్‌ల ప్రాబల్యం ఉన్నప్పటికీ, భారతదేశంలో వీటి ఆరోగ్యంపై ప్రభావం గురించి ఇంకా పూర్తి సమాచారం అవసరమని నివేదిక స్పష్టం చేసింది. ఆహారంలో పెరుగుతున్న మైక్రోప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించేందుకు ఫుడ్‌సేఫ్టీ అండ్‌స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆగస్టు 18న న్యూఢిల్లీలో కొత్త ప్రాజెక్టును ప్రారంభించింది. మైక్రోప్లాస్టిక్ కాలుష్యం పెరుగుతున్న ముప్పు అని, దీనిపై తక్షణం దృష్టిసారించాల్సిన అవసరం ఉందని వారుగుర్తించారు. ప్లాస్టిక్‌ను వాడకూడదని పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ దానిని ఇంకా ఉపయోగించడం ఆందోళనకరం. ఒక విధంగా మన ఆరోగ్యంపట్ల మనమే నిర్లక్ష్యం చేస్తున్నాం. ఆహార ఉత్పత్తులలో మైక్రోప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించడానికిప్రభుత్వం కఠినమైన నిబంధనలు, పర్యవేక్షణ వ్యవస్థలను అమలు చేయాలి. ఉప్పు, చక్కెరలలో మైక్రోప్లాస్టిక్లను అనుమతించ దగిన పరిమితులను సూచించి క్రమం తప్పక పర్యవేక్షణలు జరిపి, సాధ్యమైనంతవరకు వాటిని దూరంగా ఉంచే ప్రయత్నంచేయాలి. ఈహానికర సూక్ష్మ ప్లాస్టిక్‌ల వినియోగాన్ని ఎంతవరకు తగ్గించుకోగలిగితే ఆరోగ్యాన్ని అంత వరకు కాపాడుకోగలమని నిపుణులు సూచిస్తున్నారు. ●

# ప్రైవేట్ రంగంలోకి బొగ్గుగనులు!

బొలిముంత సాంబశివరావు

భారతదేశంలో అనేకరకాల ఖనిజ సంపదలు అపారంగా ఉన్నాయి. బొగ్గుఖనిజం వాటిల్లో ఒకటి. దేశంలో ఉన్న సహజ వనరులను, ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నట్లుగానే బొగ్గు గనులను కూడా మోడీ ప్రభుత్వం ప్రైవేట్‌రంగానికి బదలీ చేస్తున్నది. ఫలితంగా దేశంలో బొగ్గు కొరత ఏర్పడి విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. ప్రపంచంలో భూగర్భ బొగ్గునిల్వలున్న దేశాలు అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా, భారతదేశాలు బొగ్గు ఉత్పత్తి, వినియోగంలో చైనా తర్వాత భారతదేశం రెండవ స్థానంలో ఉంది. జార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలలో అతిపెద్ద బొగ్గు గనులున్నాయి. దేశంలో 32,900 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని బొగ్గు మంత్రిత్వశాఖ పేర్కొంది. ఇది దేశ అవసరాలకు సరిపోతుంది. అలాంటప్పుడు బొగ్గు దిగుమతి అవసరం ఎందుకు ఏర్పడింది. నేషనల్ కోల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 1956లో ప్రభుత్వరంగంగా ఏర్పడింది. అప్పటి ఉక్కు, గనుల శాఖమంత్రి ఎస్. మోహన్ కుమార మంగళం జాతీయం చేసిన జాబితాను, లక్ష్యాలను విడుదల చేశాడు. ప్రభుత్వ జాతీయ ఇంధన విధానంతో భారతదేశంలోని బొగ్గుగనుల జాతీయ నియంత్రణ రెండు దశల్లో జరిగింది. కోకింగ్ కోల్ చట్టాన్ని 16అక్టోబర్ 1971న ప్రకటించి (అప్పటి ఇండియన్ ఐరన్ అండ్ స్టీల్ కో, టాటా స్టీల్, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, క్యాప్టిల్ బొగ్గు గనులు మినహాయించబడ్డాయి) మొత్తం 226 కోకింగ్ బొగ్గు గనుల నిర్వహణను భారత ప్రభుత్వం చేపట్టి వాటిని జాతీయం చేసింది. 1972మే 1న భారత కోకింగ్ కోల్ లిమిటెడ్ ఏర్పడింది. 1973 జనవరిలో కోల్‌మైన్స్ ఆర్డినెన్స్ ప్రకటించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మొత్తం 711 నాన్ కోకింగ్ బొగ్గు నిర్వహణ చేపట్టింది. జాతీయకరణ తర్వాత దశలో ఈ గనులు 1973 మే 1 జాతీయం చేయబడ్డాయి. ఈ నాన్ కోకింగ్ గనులను నిర్వహించడానికి కోల్‌మైన్స్ ఆథారిటీ లిమిటెడ్ అనే ప్రభుత్వ సంస్థఏర్పడింది. ఈ రెండు కంపెనీ నిర్వహణ బాధ్యత కోసం 1975లో కోల్ ఇండియా లిమిటెడ్ ఏర్పడింది. గనులను జాతీయం చేసినతర్వాత ప్రభుత్వ రంగ సంస్థలే అత్యధికంగా బొగ్గును ఉత్పత్తి చేస్తున్నాయి. కోల్ ఇండియానే 70 శాతం దాకా ఉత్పత్తి చేసింది. కొన్ని పెద్ద కంపెనీలకు క్యాప్టిల్ బొగ్గు గనులను కేటాయించగా ఉత్పత్తి చేసే బొగ్గును వాటి ప్లాంట్లలోనే వినియోగిస్తాయి. 2018-19లో మొత్తం బొగ్గు ఉత్పత్తి 730 మిలియన్ల టన్నులు కాగా, అందులో సిఐఎల్ 606 టన్నులు ఉత్పత్తి చేసింది. గనుల స్వాధీనం, జాతీయికరణ సమయంలో 76 లేక 77 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి మాత్రమేఉంది. దీన్ని గమనిస్తే బొగ్గు ఉత్పత్తిలో సిఐఎల్ ఎంత అభివృద్ధి సాధించింది వెల్లడవుతుంది. బొగ్గు డిమాండ్ పెరిగినప్పుడల్లా



సిఐఎల్ బాగా పనిచేసింది. వార్షిక పెరుగుదల 6-7 శాతం సాధించింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో వివిధ పన్నుల పేర 44,07,581 కోట్లు కేంద్రానికి చెల్లించటమే కాకుండా 12,70,217 కోట్ల నికరలాభం గడించింది. దేశంలో సరళీకృత ఆర్థిక విధానాల అమలు, ప్రపంచ వాణిజ్య ఒప్పందం వలన ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రారంభమైంది. 2014లో మోడీ నాయకత్వాన ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల అమ్మకాలు తీవ్రమైనాయి. అందులో భాగంగా బొగ్గు గనుల వేలం ప్రక్రియ ప్రారంభమైంది. ప్రభుత్వ బొగ్గు గనుల అవసరాలకు సరిపడా బొగ్గు ఉత్పత్తిచేస్తూ లాభాలలో ఉండగా, 2017-18 సంవత్సరంలో బొగ్గు కొరత ఏర్పడిందని మోడీ ప్రభుత్వ బొగ్గు గనులశాఖ ప్రకటించడం ఆశ్చర్యం కలిగించింది. బొగ్గుకొరత రీత్యా ఇదేసంవత్సరం 235 మిలియన్ టన్నుల విదేశీ బొగ్గు దిగుమతి చేసుకోవడం జరిగింది. బొగ్గు కొరతకు కోల్ ఇండియా లిమిటెడ్ కారణం కాదు. బొగ్గు వెలికితీసే ప్రభుత్వ సంస్థలకు మోడీ ప్రభుత్వ సహకారం అందకపోవడం, సిఐఎల్ కొత్త బొగ్గు గనులు కేటాయించమని కోరినా కేటాయించకపోవడం, ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు కేటాయించిన బొగ్గుగనుల్లో ఆ సంస్థలు ఉద్దేశపూర్వకంగా నామమాత్రపు ఉత్పత్తి చేయడం విద్యుత్ కేంద్రాలు చెల్లించాల్సిన వేలాది కోట్ల బకాయిలు చెల్లించకపోవడం బొగ్గు కొరతకు కారణంగా ఉంది. ప్రభుత్వ సహకారంఉంది అంటే దేశంలో అపారంగా ఉన్న నిల్వలను కోల్ ఇండియా లిమిటెడ్ బయటకు తీసి కొరత అనే మాటకు ఆస్కారం లేకుండా చేసేది. బొగ్గు ఉత్పత్తి తగ్గేలా చేసి, బొగ్గు కొరత పేరుతో దేశ, విదేశీ ప్రైవేట్ సంస్థల ప్రయోజనం కోసం బొగ్గు కొనుగోలుకు ఎన్డీయేప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుంది. అనేక దేశాల్లో బొగ్గుధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. మనదేశ ధర కంటే 30 శాతం ఎక్కువ ధరకు దిగుమతి చేసుకుంటున్నాం. ఆస్ట్రేలియాలో 250శాతం ధర పెరిగింది. ఇండోనేషియా నుంచి భారతదేశం అత్యధికంగా బొగ్గు కొనుగోలు చేస్తున్నది. టన్నుధర 60డాలర్ల (రూ.4500) నుంచి 200 డాలర్లకు (15వేలకు) పెరిగింది. కేంద్రప్రభుత్వ సంస్థ ఎన్టీపిసి 8,308కోట్ల విలువచేసే 6.25 మిలియన్ టన్నుల బొగ్గును ఒకప్రైవేట్ ఎంటర్‌ప్రైజేస్ ద్వారా కొనుగోలు చేసింది. దీనికిముందు కూడా 5.75మిలియన్ టన్నుల బొగ్గును రూ. 8,422 కోట్లకు సరఫరా చేయడానికి అదే గ్రూపుతోనే ఒప్పందం చేసుకుంది. ఎన్టీపిసి మొత్తం 20వేల మిలియన్ టన్నుల కొనుగోలుకు సిద్ధమైంది. దిగుమతిచేసుకున్న బొగ్గు విలువ 9 బిలియన్ల డాలర్ల దాకా ఉంది. దేశంలో బొగ్గు తవ్వకాల్లో అనేక వివాదాలు చోటు చేసుకున్నాయి. 1993 నుంచి రెండు దశాబ్దాల కాలంలో బొగ్గుకలిగి ఉన్నప్రాంతాలను తప్పుగా కేటాయించడంపై కోల్గేట్ కుంభకోణం యూపిఏ2 ప్రభుత్వాన్ని తీవ్రసంక్షోభంలోకి నెట్టింది. ఆగస్టు 2012లో భారత కంట్రోలర్ ఆడిటర్ జనరల్ బొగ్గుబ్లాకుల ప్రైవేటీకరణ, ప్రభుత్వ కంపెనీలకు కేటాయింపులు పారదర్శకంగా లేని ఏకపక్ష విధంగా ఉన్నాయని కేంద్రప్రభుత్వంపై అభియోగాలు మోపింది. 2014లో సుప్రీంకోర్టు 218 బొగ్గు బ్లాకుల్లో 214 బ్లాకులు రద్దు చేయాలని ఆదేశించింది. ఇంకా అనేక ఒప్పందాలను రద్దుచేస్తూ తీర్పుఇచ్చింది. కేంద్రంబొగ్గు గనులప్రత్యేక కేటాయింపుల చట్టానికి, గనుల ఖనిజాల చట్టానికి సవరణలుచేసి దాన్ని ఆమోదింపచేసింది. ఆ విధంగా సుప్రీంకోర్టు తీర్పునువ్యతిరేకించింది. ప్రభుత్వమే బొగ్గు వెలికితీసి విక్రయిస్తే 33వేలకోట్లకన్నా ఎక్కువ లభిస్తుంది. ●



## డిజిపితో బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని బ్రిటిష్ రాయబార కార్యాలయంలో డిప్యూటీ హైకమిషనర్ గారెత్‌విన్ ఓవెన్ మంగళవారం డిజిపి జితేందర్‌తో భేటీ అయ్యారు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ భేటీ మర్యాదపూర్వకంగా జరిగింది. ఈ భేటీలో బ్రిటీష్ రాయబార కార్యాలయ ఉన్నతాధికారి నళిని రఘురామన్ కూడా పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల్లో భద్రత పెంపు

### కోల్‌కతా ఘటన నేపథ్యంలో ప్రత్యేక సిబ్బంది నియామకం

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** కోల్‌కతాలో వైద్యవిద్యార్థిని హత్య ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలు, ఆసుపత్రులలో భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించింది. డిజిపి ఆదేశాలతో వైద్యుల భద్రతకు భరోసా కల్పించే విధంగా విజువల్ పోలీసింగ్‌కు చర్యలు చేపట్టారు. ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ ఆసుపత్రులతో పాటు ఆయా జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రతీ రోజు పెద్ద సంఖ్యలో రోగులు, సహాయకులు వస్తుంటారు. జూనియర్ డాక్టర్లపై ఎలాంటి దాడులకు అవకాశం లేకుండా ముందు జాగ్రత్తగా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని కమిషనర్లు, ఎస్పీలకు డిజిపి కార్యాలయ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఆసుపత్రులు, కాలేజీల వద్ద తప్పనిసరిగా గస్తీలో ఉండే పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన చోట ప్రత్యేకంగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సెక్యూరిటీ పరంగా విధులు నిర్వహిస్తున్న ప్రైవేట్ ఏజెన్సీలతో అధికారులు సమావేశమై భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆసుపత్రుల్లో అమర్చిన సీసీ కెమెరాలన్నీ పూర్తి స్థాయిలో పనిచేస్తున్నదీ లేనిదీ సరిచూసుకోవాలన్నారు. అవసరాన్ని బట్టి ఎక్కడైనా కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి వస్తే సంబంధిత అధికారులతో చర్చించి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ఇతర రాష్ట్రాల బ్యాంకుల్లో రుణాలు మాఫీ చేయండి

### తెలంగాణ సరిహద్దులోని రైతుల విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలలోని వివిధ బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలను కూడా మాఫీ చేయాలని రాష్ట్రానికి చెందిన సరిహద్దు ప్రాంతాల రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి చెందిన గద్వాల్, సూర్యాపేట్, ఖమ్మం తదితర జిల్లాలకు చెందిన పలువురు రైతులు సరిహద్దు ప్రాంతాల్లోని కర్నూలు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లోని వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం రుణ మాఫీ విషయంలో కేవలం తెలంగాణలోని బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తోంది. కానీ ఇక్కడి రైతులు సరిహద్దు రాష్ట్రాల్లో తీసుకున్న పంట రుణాలను మాత్రం మాఫీ చేయడం లేదు. ఈ నేపథ్యంలో తమ రుణాలను కూడా మాఫీ చేయాలని తెలంగాణకు చెందిన పలువురు రైతులు కోరుతున్నారు. ఈ విధంగానే గద్వాల్ జిల్లాలోని అలంపూర్ తదితర మండలాల రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాల్లోని బ్యాంకుల్లో తీసుకున్న తమ పంట రుణాలను మాఫీ చేయాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

దీనికి సంబంధించి పలువురు రైతులు ఇప్పటికే జిల్లా కలెక్టరును కలిసి వినతిపత్రం సమర్పించారు. దశాబ్దాలుగా ఈ ప్రాంత సరిహద్దు గ్రామాల రైతులు తమ పొలాలను సాగు చేసేందుకు కర్నూలు తదితర ప్రాంతాల్లోని వివిధ బ్యాంకుల నుండి పంట రుణాలు పొందారు. ఇలా ఒక్క గద్వాల జిల్లాలోని వివిధ గ్రామలకు చెందిన దాదాపు 400 మంది రైతులు కర్నూలు జిల్లాలోని బ్యాంకులు పంట రుణాలు తీసుకున్నారు. ఇతర రైతుల పంట రుణాలు మాఫీ అవుతున్నా తమ రుణాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలంగాణకు చెందిన పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# రిజిస్ట్రేషన్లు డబుల్.. ఆదాయం ఏడింతలు

### అత్యధికంగా రంగారెడ్డి జిల్లా .. అత్యల్పం కుమ్రంభీం ఆసిఫాబాద్..

### ఆదాయంలో దక్షిణాదిలో నాలుగో స్థానం

### స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ నివేదికలో వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ల ఆదాయం పదేళ్లలో ఏడింతలు పెరిగింది. అదే సమయంలో రిజిస్ట్రేషన్ అవుతున్న డాక్యుమెంట్లు రెండింతలకు పైగా పెరిగాయి. 2014 15లో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల ఆదాయం రూ.2,746 కోట్లు కాగా, 2023 24లో రూ.14,588 కోట్లకు చేరింది. ఒక్క కరోనా ఏడాదిలో మినహా ప్రతీ ఏడాది ఆదాయంలో వృద్ధి కనిపించింది. అదే డాక్యుమెంట్ల విషయానికి వస్తే అప్పుడు 8.27 లక్షలు రిజిస్ట్రేషన్ కాగా, గతేడాది ఆ మొత్తం 18.41 లక్షలకు చేరింది. ఈమేరకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ వార్షిక నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. గత ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో అంతకు ముందు సంవత్సరంతో చూస్తే అగ్రికల్చర్ డాక్యుమెంట్లు లక్ష మేర తగ్గాయి. అదే నాన్ అగ్రికల్చర్ విషయానికి వస్తే పెద్దగా మార్పు లేనప్పటికీ గత ఏడాది నాన్ అగ్రికల్చర్ ఓపెన్ ప్లాట్లపై జనాలు అమ్మకాలు, కొనుగోళ్లు ఎక్కువగా చేశారు. మొత్తంగా 10.50 లక్షల సేల్ డీడ్స్ జరిగితే అందులో 3.91 లక్షలు ఓపెన్ ప్లాట్లవి. 1.03 లక్షలు ఇండ్లకు, ప్లాట్లకు 94,884. ఇక అగ్రికల్చర్లో 4.60 లక్షల సేల్ డీడ్స్ చేసుకున్నట్లు నివేదికలో పేర్కొన్నారు.

ఎక్కువగా ఆదాయం తెచ్చిపెడుతున్న జిల్లాల్లో రంగారెడ్డి టాప్‌లో ఉండగా, ఆ తరువాత మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాలు ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ పరిధిలో 2023 24 లో అగ్రికల్చర్ , నాన్ అగ్రికల్చర్ కలిపి రూ.4798 కోట్లు రాగా, అత్యల్ప ఆదాయం వచ్చిన జిల్లా రూ.13 కోట్లతో కుమ్రం భీం ఆసిఫాబాద్. గత ఏడాది ఒక్క హెచ్‌ఎండిఏ పరిధిలో నాన్ అగ్రికల్చర్ కింద రూ.7476 కోట్లు వచ్చింది. ఎక్కువ ఆదాయం వస్తున్న టాప్ 30 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రంగారెడ్డి ఎస్ఆర్‌వో ఉంది. ఆ తరువాత గండిపేట నిలిచింది. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఆదాయంలో దక్షిణ భారతదేశంలో తెలంగాణ నాలుగో స్థానంలో ఉన్నది. ముందు మహారాష్ట్ర ఉండగా, ఆ తరువాత కర్నాటక, తమిళనాడు ఉన్నాయి. తెలంగాణ కంటే తక్కువ ఆదాయం ఏపీలో వచ్చినట్లు నివేదికలో వెల్లడించారు.

# రాష్ట్రంలో క్రీడల విశ్వవిద్యాలయాలను ప్రారంభిస్తాం

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 27, ప్రభాతవార్త:** ప్రపంచంలో క్రీడాపోటీల్లో తెలంగాణ ప్రాతినిధ్యానికి, బంగారు పతకాలు సాధించడానికి క్రీడల విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో తప్పనిసరిగా ఒక పిరియడ్ క్రీడలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌బి స్టేడియంలో నిర్వహిస్తున్న ఉద్యోగుల క్రీడా పోటీలను ఉప ముఖ్యమంత్రి మంగళవారం ప్రారంభించి మాట్లాడారు.

రాజధాని హైదరాబాద్ నగరంలో ప్రసిద్ధ క్రీడా పోటీలను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రపంచ స్థాయి క్రీడా మైదానాలు ఉన్నాయని, అవకాశం కల్పించాలని కోరుతూ ఇటీవల కేంద్ర క్రీడల శాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

నిధుల కొరత లేదని, అవసరాలకు తగిన విధంగా నిధులు కేటాయి స్తామని, క్రీడల ద్వారా వచ్చే స్ఫూర్తి జీవితానికి పెద్ద ఎత్తున ఉపయోగ పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలంటే కచ్చితంగా వ్యాయామంతో పాటు క్రీడలు కూడా ఆడాలన్నారు. గత పాలకుల నుంచి వచ్చిన క్రీడా సముదాయాలను ఆస్తులను మరమ్మత్తు చేసి అభివృద్ధి చేస్తామని ఆయన తెలి పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్, శాట్ ఛైర్మన్ శివసేనరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ఎల్‌బి స్టేడియంలో జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, చిత్రంలో అనిల్‌కుమార్‌యాదవ్, శివసేనరెడ్డి, తదితరులు

# 5లోపు బి-కేటగిరి సీట్ల ర్యాటిఫికేషన్ వివరాలు సమర్పించాలి

### రూ. 1,000 అపరాధ రుసుంతో 10 వరకు అవకాశం

### ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు ఉన్నత విద్యామండలి ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా(బీ కేటగిరి) సీట్ల భర్తీకి సంబంధించిన వివరాలను సెప్టెంబర్ 5లోపు తెలంగాణ ఉన్నత విద్యా మండలికి ర్యాటిఫికేషన్ కోసం పంపించాలని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ యాజమాన్యాలను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాలకి సూచించారు. ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఆయా కాలేజీల్లో బీ కేటగరిలో చేసిన విద్యార్థులను వివరాలను ర్యాటిఫికేషన్ కోసం సెప్టెంబర్ 5లోపు ఉన్నత విద్యా మండలికి పంపించాలన్నారు.

అపరాధ రుసుం రూ. 1000తో సెప్టెంబర్ 10 వరకు అవకాశం కల్పించినట్టు మంగళవారం జారీ చేసిన ప్రకటనలో తెలిపారు. బీ కేటగిరి సీట్ల వివరాలను ర్యాటిఫికేషన్ కోసం సెప్టెంబర్ 10లోపుగా పంపించాలని కాలేజీ యాజమాన్యాలను ఆదేశించారు. ఈ నెల 1 నుంచి 9 వరకు రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు బీ కేటగిరీ సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్‌ను జారీ చేశాయి. నోటిఫికేషన్‌ను జారీ చేసిన తరువాత ప్రైవేటు కాలేజీలు 6 రోజుల పాటు దరఖాస్తులను స్వీకరించడానికి అవకాశం కల్పించారు.

ఉన్నత విద్యా మండలి జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు బీ కేటగిరీ సీట్ల భర్తీ కోసం పత్రికల్లో నోటిఫికేషన్‌ను జారీ చేశాయి. అనంతరం దరఖాస్తులను స్వీకరించాయి. బీ కేటగిరీకి సంబంధించిన మార్గదర్శకాలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఇప్పటికే జారీ చేసింది. బీ కేటగిరి సీట్ల భర్తీ కోసం తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ లీడింగ్ పత్రికల్లో నోటిఫికేషన్‌ను ఈ నెల 9 లోపు జారీ చేయాలని సూచించింది. విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి కనీసం 6 రోజులు అవకాశం కల్పించాలని ఉన్నత విద్యా మండలి సూచించింది.

అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 29లోపు పూర్తి చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేసిన అనంతరం బీ కేటగిరి సీట్లలో చేరిన విద్యార్థుల వివరాలను సెప్టెంబర్ 10 లోపు సమర్పించాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది. ఇంజనీరింగ్ సీట్లలో మేనేజ్‌మెంట్ కోటాలో 30 శాతం సీట్లు అందుబాటులో ఉంటాయి. రాష్ట్రంలోని 156 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో మొత్తం సీట్లు 1,12,069 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో కన్వీనర్ కోటాలో 86,943 సీట్లు అందుబాటులో ఉండగా.. బీ కేటగిరిలో 25,126 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

# గణేశ ఉత్సవాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి




మంగళవారం ఎంసిహెచ్‌ఆర్‌డిలో అన్ని శాఖల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

### మట్టి విగ్రహాల ఏర్పాటుపై అవగాహన కల్పించాలి

### నిమజ్జనం కోసం టస్కర్ వాహనాలు, క్రేన్లు సిద్ధం చేయాలి

### సన్నాహక సమావేశంలో మంత్రులు పొన్నం, శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** రానున్న గణేశ ఉత్సవాల కోసం అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మట్టి విగ్రహాల ఏర్పాటుపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. హైదరాబాద్‌లో గణేశ ఉత్సవాలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాదిగా పాల్గొనే అవకాశం ఉన్నందున చేయాల్సిన ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు మంగళవారం ఎంసిహెచ్‌ఆర్‌డిలో అన్ని శాఖలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో శాంతి భద్రతల సమస్య వస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో రంజాన్, మొహర్రం, బోనాల పండుగలను విజయవంతంగా జరుపు కున్నామనీ, అదే విధంగా గణేష్ ఉత్సవాలను కూడా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పోలీస్, విద్యుత్, రవాణా, ఆర్టీసీ, మెట్రో, జీహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గత సంవత్సరం కంటే 10 శాతం విగ్రహాలు పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా నిమజ్జన ఏర్పాట్లు చేయాలన్నారు. నగరంలో 141 లాగింగ్ పాయింట్స్ దగ్గర పనులు త్వరగా పూర్తి చేయాలనీ, బేబీ పాండ్స్ ఏర్పాటు చేయాలన్నారు. రవాణా శాఖ అధికారులు విగ్రహాల నిమజ్జనం కోసం టస్కర్ వాహనాలు, క్రేన్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పుకు అనుగుణంగా పివోపి విగ్రహాలు కాకుండా మట్టి విగ్రహాలను పూజించేలా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 7 జోన్ల పరిధిలో జోనల్ కమిషనర్, డిసిపిలు మండపాల నిర్వాహకులతో సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సూచించిన అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నగరంలో రోడ్ల మరమ్మత్తులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. సెప్టెంబర్ 1 నుంచి స్వయంగా అన్ని ప్రాంతాలలో పర్యవేక్షిస్తాననీ, బేబీ పాండ్స్‌లో ఫ్రెష్ వాటర్ ఉండేలా చేయడంతో పాటు నిమజ్జనం జరుగుతున్న చెరువుల్లో డెబ్రిస్ తొలగించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, డీజీపీ జితేందర్, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిత్తల్, హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో పాటు హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు పాల్గొన్నారు.

# బిజెపి, బిఆర్‌ఎస్ కుమ్మక్కుతోనే కవితకు బెయిల్

### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్

### ఆ పార్టీలది చీకటి ఒప్పందం : జగ్గారెడ్డి

### రాత్రి ఢిల్లీలో బిజెపితో డీల్ సెటిల్ : ఈరవత్రి అనిల్

### కాషాయదళ నేతలతో కాళ్లబేరం కుదుర్చుకున్న కల్వకుంట్ల కుటుంబం : బండ్రు శోభరాణి



**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** మద్యం కేసులో నిందితురాలు ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై కాంగ్రెస్ వర్గాలు తీవ్రంగా స్పందించాయి. టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ బిజెపి బిఆర్‌ఎస్ కుమ్మక్కుతోనే బెయిల్ వచ్చిందని నిందించారు. మరో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి బిఆర్‌ఎస్ బిజెపి చీకటి ఒప్పందం కవిత బెయిల్ అంటూ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నాయకులు కవిత బెయిల్‌పై బిఆర్‌ఎస్‌ను విమర్శిస్తూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు వారి మాటల్లోనే ..

**బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనప్రక్రియ ఆరంభం : మహేశ్‌కుమార్‌గౌడ్**

బిజెపిలో బిఆర్‌ఎస్ విలీన ప్రక్రియ మొదలైంది. కవిత బెయిల్ ఊహించిందే. బిజెపి, బిఆర్‌ఎస్ చీకటి ఒప్పందంతో కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ బిజెపికి దాసోహమైంది. బిఆర్‌ఎస్ బిజెపి కుమ్మక్కైతోనే కవితకు బెయిల్ వచ్చింది. హరీశ్, కెటిఆర్‌లు ఢిల్లీలో బిజెపి నేతల చుట్టు ఆపద మొక్కులు మొక్కారు. బిజెపి నేతల ఇళ్ళచుట్టు తిరిగి కాళ్లమీదపడి కవితకు బెయిల్ తెచ్చుకున్నారు. బిజెపి బిఆర్‌ఎస్ రాజకీయాలను తెలంగాణ ప్రజలు అర్థంచేసుకోవాలి.

**కెసిఆర్‌కు మోడీ ఇచ్చిన రిటర్న్‌గిఫ్ట్: జగ్గారెడ్డి**

లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి ఎనిమిది ఎంపి స్థానాలు గెలిచేందుకు సహకరించినందుకు కెసిఆర్‌కు కవిత బెయిల్ రూపంలో మోడీ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చిండు. కవిత కోసం సొంత పార్లమెంట్ నియోజకవర్గం కెసిఆర్ వదిలేసుకున్నారు. రాజకీయంగా కాంగ్రెస్‌ను బలహీన పరిచే ఒప్పందంలో భాగంగానే బిజెపి బిఆర్‌ఎస్ ఎత్తుగడ ఇది. బిఆర్‌ఎస్ బిజెపి కలిసిపోవడంతో మాకు నాలుగు సీట్లు తగ్గాయి. బిజెపి ఉత్తరాదిన వీక్ అయ్యింది. దక్షిణాన బిఆర్‌ఎస్ బలహీనపరిచి బిజెపిని బలోపేతం చేసింది. బిఆర్‌ఎస్ బిజెపికి పావుగా పనిచేస్తుంది. జడ్జి బెయిల్ ఇవ్వకముందే మూడు రోజుల నుంచి కవితకు బెయిల్ వస్తుందని బిఆర్‌ఎస్ సోషల్‌మీడియా ప్రచారం చేసిందంటే ఇది నిజంగా బిజెపి బిఆర్‌ఎస్ చీకటి ఒప్పొందమే. బిఆర్‌ఎస్‌కు మంచి రోజులు బిజెపి వల్ల వచ్చింది. జడ్జిచెప్పక ముందే బెయిల్ వస్తదని ఎలా వీళ్ళకు తెలిసింది. మేం జడ్జీని తప్పుపట్టడంలేదు. న్యాయవ్యవస్థ కెసిఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోవాలి. సిసోడియాకు కెజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడానికి ఆలోచించిన కోర్టులు కవితకు ఐదు నెలలలో బెయిల్ వచ్చిందంటేనే బిజెపి బిఆర్‌ఎస్ చీకటి ఒప్పందం తెలుపుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలో ఉంది అందుకే బిజెపి ఇక బిఆర్‌ఎస్‌ను కలుపుకొనాలనుకుంటుంది.

**తెలంగాణ మహిళల గౌరవం తగ్గించిన కవిత : బండ్రు శోభారాణి**

లిక్కర్ కేసులో అరెస్టై తెలంగాణ రాష్ట్ర మహిళ గౌరవం తగ్గించింది కవిత. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అందరు ఢిల్లీకి వెళ్ళిబిజెపి నేతలతో కాళ్ళబేరం చేసి బెయిల్ తెచ్చుకున్నారు. బెయిల్ వస్తుందని బిఆర్‌ఎస్ బిజెపిలో విలీనం అవుతుందని ముందే కాంగ్రెస్ చెప్పింది. బిఆర్‌ఎస్ బిజెపి రెండు పార్టీలు ఒక్కటే అని తెలంగాణ ప్రజలు ఇప్పటికైనా తెలుసుకోవాలి. కవిత అనే ఒక మహిళ లిక్కర్ కేసులో అరెస్టుకావడం తెలంగాణరాష్ట్రంకు ఒక మాయని మచ్చలాంటిది.

**రాత్రి ఢిల్లీలో డీల్ సెటిల్ అయింది :** మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ ఈరవత్రి అనిల్ రాత్రి ఢిల్లీలో బిజెపి నేతలతో డీల్‌సెట్ అయింది కాబట్టే కవితకు బెయిల్ వచ్చింది. ఢిల్లీలో ఒప్పందం చేసుకోవడానికి కెటిఆర్ ఎమ్మెల్యేలు అందరు కలిసి వెళ్ళారు. బిఆర్‌ఎస్ లోక్‌సభ ఎన్నికల నుంచే బిజెపికి అనుబంధంగా మారింది. బిజెపికి ఓటు వేయాలని బిఆర్‌ఎస్ ఎంపి అభ్యర్థులు గత ఎన్నికల్లో ప్రచారం చేశారు. కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు బిజెపి బిఆర్‌ఎస్ ఒక్కటైనవి అనడానికి కవిత బెయిల్ ప్రత్యక్ష ఉదాహరణ.

**వారి బంధం బయటపడింది: సామ రామ్మోహన్‌రెడ్డి**

కవితకు ఐదునెలలోనే బెయిల్ రావడం సిసోడియాకు 17నెలకు గాని బెయిల్ రాలేదు ఇదే అంశంతో బిఆర్‌ఎస్ బిజెపి బంధం బయటపడింది. బిజెపితో చేసుకొన్నఒప్పందంలో భాగంగానే బెయిల్ రాబోతుందని వారం క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. బిజెపి బిఆర్‌ఎస్ విలీనం జరగబోతుంది. పక్కరాష్ట్రం అవినీతికి కవిత శిక్ష అనుభవించింది ఇక తెలంగాణలో చేసిన అవినీతికి కూడా కల్వకుంట్ల కుటుంబంశిక్ష అనుభవించక తప్పదు.

# రాష్ట్రానికి 200 మెగావాట్ల విద్యుత్

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** తెలంగాణలో ఏటా 200 మెగావాట్ల సోలార్ ఎనర్జీ అందించేలా నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ముందుకొచ్చింది. కేంద్రం తీసుకొచ్చిన ఇండియన్ రెన్యువబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఐఆడిఎ) పథకంలో భాగంగా 510 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని గుజరాత్‌లో ఏర్పాటు చేస్తోంది. దాదాపు 1,214 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఈ సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులు పూర్తికావచ్చాయి. వచ్చే ఏడాది జూన్ నుండి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కానుంది. ఈ సోలార్ పవర్ ప్రాజెక్టు తెలంగాణ విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలకంగా మారనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కిలోవాట్ పర్ అవర్‌కు 2.57 రూపాయలకు విద్యుత్ అందుబాటులోకి రానుంది. తద్వారా వచ్చే 25 ఏళ్లలో దాదాపు 2 వేల కోట్ల రూపాయలు తెలంగాణ ట్రాన్స్‌కోకు ఆదా అవుతుందని అంచనా. అంతేకాకుండా ఎస్‌జిఎస్టీ రూపంలో కూడా రాష్ట్రానికి ఆదాయం సమకూరనుంది. మరోపక్క ఈ సోలార్ రపాజెక్టు జీవిత కాలంలో సరఫరా చేసే 12.5 బిలియన్ యూనిట్ల గ్రీన్ ఎనర్జీ ద్వారా 8.9 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలను అడ్డుకోవచ్చని లెక్క కడుతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం నైవేలీ లిగ్నైట్ సంసథతో ఒప్పందాలు చేసుకోనుంది.

# బిఆర్‌ఎస్ హయాంలో అన్నీ అక్రమాలే

### గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్ (గోషామహల్), ఆగస్టు 27, ప్రభాతవార్త:** తెలంగాణలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ హయంలో ఎన్నో అవినీతి, అక్రమాలు జరిగాయని గోషామహల్ నియోజకవర్గం బిజెపి శాసనసభ్యులు టి.రాజాసింగ్ ఆరోపించారు. ప్రభుత్వ,అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలు, నాలాలు,పార్కులను కబ్జా చేసినట్లు దుయ్యబట్టారు. అదే కోవలోనే బిఆర్‌ఎస్‌కు పదిసంవత్సరాలు మిత్రపక్షంగా ఉన్న మజ్లీస్ సోదరులు కూడా చెరువును కబ్జాచేసి ఏకంగా కళాశాలను నిర్మించారన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయానికి తాను మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. పదిసంవత్సరాలుగా చెరువులను, కుంటలను, నాలాలను కబ్జా చేసుకుని బహుళ అంతస్థులను నిర్మించిన వాటిని కూల్చి వేసే విధంగా హైడ్రాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సంకల్పం పూర్తి కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఓవైసీ బ్రదర్స్ బెదరింపులకు భయ పడొద్దని రాజాసింగ్ విన్నవించారు. వేలమంది యువత మద్దతు ఉందని మజ్లీస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ బెదరిస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి మాదిరిగా భయపడ కుండా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందు కెళ్లాలని సూచించారు. కబ్జాదారుల గుండెళ్ల రైల్ పరుగెడుతున్నట్లు చెప్పారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

### రెవెన్యూ, హౌసింగ్ సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ప్రభుత్వ భూములు పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళిశాఖల మంత్రి తుమ్మలనాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ రెవిన్యూ, హౌసింగ్‌పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యత మనపై ఉందన్నారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీ, ప్రభుత్వ భవిష్యత్ అవసరాలకు పరిశ్రమలు, అభివృద్ధికి స్థలాలు ఎంతో అవసరమన్నారు. రఘునాథపాలెం మంలంలో అక్రమ మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. మైనింగ్, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని అక్రమ మైనింగ్‌కి అడ్డుకట్ట వేయాలన్నారు. ఖమ్మం అర్బన్ మండలం గోళ్లపాడు చానల్‌పై ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ జీవో 58,59లపై న్యాయబద్ధంగా లేని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి స్థలాలను స్వాదీనం చేసుకుని ఫెన్సింగ్ ఏర్పాటు, రక్షణ చర్యలు చేయాలన్నారు. రోడ్డు ఆక్రమణలు, అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్న చోట ప్రత్యామ్నాయ స్థలం చూపాలన్నారు. రోడ్ల విస్తరణపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్ఎస్పీ భూములకు సంబంధించి చట్టబద్ధంగా స్థలాల పంపిణీ, ఆక్రమణలపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. చెరువులు, కాల్వల స్థలాల పరిరక్షణ చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద ఏరోజుకారోజు తడి, పొడిచెత్త వేరు చేయడం, డిస్పోజ్ చేయడం జరగాలన్నారు. రహదారుల కిరువైపుల మొక్కలు నాటేటప్పుడు విస్తరణ కరెంట్ లైన్లను దృష్టిలో పెట్టుకొని, భవిష్యత్ అవసరాల మేరకు చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. నిర్మాణం చేపట్టిన అన్ని డబుల్ బెడ్‌రూం ఇండ్లకు సంబంధించి, అధికారులు అన్ని కాలనీలు సందర్శించి నిర్మాణ పనుల పరిస్థితిని తనిఖీ చేయాలన్నారు. ప్రారంభించిన ఇండ్లు పునాది లెంటల్, స్లాబ్ వరకు తుది దశలో ఉన్న ఇండ్ల పరిస్థితి వారిగా సమగ్ర నివేదిక సమర్పించానలని, ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేయడానికి అవసరమైన నిధుల వివరాలు సమర్పించాలని మంత్రి అన్నారు. ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ గుర్తించిన స్థలాల పరిరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు అన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. వివిధ దశల్లో ఉన్న డబుల్‌బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితిపై అధికారులు నివేదిక సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, డిఆర్డీవో సన్యాసయ్య, డిఆర్వో ఎం.రాజేశ్వరి, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, ఏడి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బి ఎస్ఇ హేమలత, పిఆర్ఇఇ వెంకట్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ తానాజీ, ఇర్రిగేషన్ ఇఇ అనన్య, హౌసింగ్ ఇఇ శ్రీనివాస్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి దేవస్థానం
యాదగిరిగుట్ట-508115 :: యాదాద్రి - భువనగిరి జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ఆర్.సి.నం.ఎ1/1933/2023 తేది: 26.07.2024
శ్రీ లక్ష్మీనరసింహా స్వామి వారి దేవస్థానం, యాదగిరిగుట్ట - ఈ దేవస్థానము నందలి వివిధ విభాగములకు అవసరమగు సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిపై సరఫరా చేయుటకు అర్హత గల ఏజెన్సీల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు కోరబడుచున్నవి. మరియు సింగిల్ షీట్, 13 షీట్స్ క్యాలెండర్స్ సరఫరా చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్లు మరియు సీల్డ్ టెండర్స్ కోరబడుచున్నవి.
పూర్తి వివరములకు www.tender.telangana.gov.in.endowments marketing department సందర్శించగలరు. దేవస్థాన కార్యాలయ పనివేళలలో విచ్చేసి తెలుసుకొనవచ్చును. సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 8333993244, 8333994007, 996383546, 8333994009. (క్యాలెండర్స్ కొరకు).
సం/-. ఎ.భాస్కర రావు, కార్యనిర్వహణాధికారి.
DIPR.No.3282-PP/CL/Advt/1/2024-25 తేది: 27.08.2024

వార్త, ఖమ్మం, బుధవారం 28, ఆగస్టు 2024

# ఇద్దరు తెలంగాణ ఉపాధ్యాయులకు జాతీయ అవార్డు

### ఖమ్మం జిల్లా నుంచి పి.ప్రభాకర్‌రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి తాడూరి సంపత్‌కుమార్

### 5న రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డుల ప్రదానం

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లాకి చెందన ఒక ఉపాధ్యాయుడు, రాజన్న సిరిసిల్ల జిల్లాకి చెందిన మరో ఉపాధ్యాయుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకి ఎంపికయ్యారు. ఖమ్మం జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలంలోని జడ్‌పిహెచ్‌ఎస్ తిరుమలాయపాలెం పాఠశాలలోని పీసర ప్రభాకర్ రెడ్డి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకి చెందిన సిరిసిల్లలోని దమ్మన్నపేటలోని జడ్‌పీహెచ్‌ఎస్ స్కూల్‌లో పనిచేసే తాడూరి సంపత్ కుమార్ కూడా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకి ఎంపికయ్యారు. వీరికి జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం అయిన సెప్టెంబర్ 5న ఢిల్లీలోని విద్యా భవన్‌లో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును అందించనున్నారు. అవార్డుతోపాటు రూ. 50వేల ఆర్థికసాయంతోపాటు సిల్వర్ మెడల్‌ను అందిస్తారు.

## వేం నరేందర్ ఆశీస్సులు తీసుకొన్న ఎన్‌ఎస్‌యుఐ కొత్త అధ్యక్షుడు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మంగళవారం ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడుగా కొత్తగా నియామకమైన ఎడవెల్లి వెంకటస్వామి కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. వేం నరేందర్‌రెడ్డి ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవెల్లి వెంకటస్వామికి పార్టీ ప్రభుత్వ విధానాలు ప్రజల్లోకి తీసుకొనివెళ్లే దిశను నిర్దేశించారు. ముఖ్యంగా విద్యార్థులు, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేయడం పట్ల అవగాహన పెంచాలని చెప్పారు. విద్యార్థుల సమస్యలు గుర్తించి వాటి కోసం ప్రభుత్వానికి వెంటవెంటనే నివేదించాలని ఆయన సూచించారు. వేం నరేందర్‌రెడ్డి కొత్త ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. యువతకు పార్టీ కార్యక్రమాలపై అవగాహన పెంచాలని సూచించారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు ఎసిబి సూచన

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎసిబి సూచనలు చేసింది. గుర్తు తెలియని వ్యక్తులు తాము ఎసిబి అధికారులుగా చెప్పుకుంటూ ప్రభుత్వ ఉద్యోగులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఈ క్రమంలో పలువురు ఉద్యోగులు ఇది నిజమని నమ్మి అక్రమార్కులకు డబ్బులు ఇచ్చేస్తుండడం సరైన పద్ధతి కాదని ఎసిబి పేర్కొంది. ఎసిబి అధికారులు ఎవరూ ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్‌లు చేసి డబ్బులు డిమాండ్ చేయరని, ఒకవేళ ఎవరికైనా ఈ తర హా ఫోన్‌లు వస్తే ఇది కచ్చితంగా ఫేక్ కాల్స్‌గా గుర్తించాలని ఎసిబి కోరింది. ఈ తరహా ఫోన్ కాల్స్‌పై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి నిందితులను పట్టుకునే విషయంలో పోలీసులకు సహక రించాలని ఎసిబి కోరింది. వరంగల్‌లో వెలుగుచూసిన ఇటువంటి ఘటనపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని, ప్రభుత్వ ఉద్యోగులు తమకు వచ్చే ఫేక్ కాల్స్‌పై 1064కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎసిబి కోరింది.

## హైడ్రా పరిధిని యాదాద్రి వరకూ విస్తరించండి

### సిఎం రేవంత్‌కు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 27:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ కీలక నేత,ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మంగళవారం లేఖ రాశారు. హైడ్రా పరిధిని యాదాద్రి వరకు విస్తరించాలని లేఖలో రిక్వెస్ట్ చేశారు. గత పదేళ్లలో యాదాద్రిలోనూ బిఆర్‌ఎస్ నేతలు అక్రమ నిర్మాణాలు అనేకం నిర్మించారని… తక్షణమే వాటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందులో భాగంగానే హైడ్రాను యాదాద్రి వరకు విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైడ్రాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. రాజధాని నగరంలో ఆక్రమణలను సత్వరమే గుర్తించి వాటిని అడ్డుకోవడం హైడ్రా లక్ష్యం. ఈ నేపథ్యంలో నగరంలో హైడ్రా దూసుకుపోతుంది. ఎవరినీ వదలకుండా పంజా విసురుతోంది. ఇటీవలే హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో అక్కినేని నాగార్జునకు చెందిన కన్వెన్షన్ కూల్చివేత రాష్ట్రంలో కలకలం రేపిన విషయం తెలిసిందే.



ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న డా.జి.చిన్నారెడ్డి.

## 'ప్రజావాణి'కి 587 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట) ఆగస్టు 27, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 587 దరఖాస్తులు అందాయి. వీటిలో మైనార్టీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 118 దరఖాస్తులు, రెవెన్యూ సమస్యలకు సంబంధించి 94 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు సంబంధించి 88దరఖాస్తులు, పౌర సరఫరాల శాఖకు సంబంధించి 48 దరఖాస్తులు, పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 47 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 192 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.జి.చిన్నారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని దరఖా స్తుల ను స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిం వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

**చిన్నారెడ్డిని కలిసి సమస్యను వివరించిన ప్రైవేటు ఉపాధ్యాయులు**

సెప్టెంబరు 5వ తేదీన జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం గురించి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించే కార్యక్రమంలో ప్రైవేటు ఉపాధ్యాయులను కూడా భాగస్వాములను చేయాలని మంగళ వారం ప్రజాభవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జి. చిన్నారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి విద్యాశాఖ సెక్రటరీకి లెటర్‌పైన ఎండార్స్‌చేసి పంపించారు. ప్రైవేటు టీచర్లకు న్యాయం జరిగేలా చూడాలని విద్యాశాఖ కమీషనర్ నరసింహారెడ్డికి తెలియజేసారు.

# పెట్రోల్‌బంకుల్లో మోసాలపై నిఘా పెంచండి

### వినియోగదారుడి హక్కుల పరిరక్షణకు నిరంతర తనిఖీలు.. పట్టుబడితే కఠినచర్యలు

### సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** తూనికలు కొలతలలో అవకతకలకు పాల్పడుతూ వినియోగ దారులను మోసం చేస్తే ఎవ్వరిని ఉపేక్షించేదిలేదని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సచివాలయంలో తూనికలు కొలతల శాఖ ప్రత్యేక కార్యదర్శి డిఎస్ చౌహాన్, సహాయ కార్యదర్శి ప్రియాంక తెలంగాణ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేశ్వర్‌లతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన తూనికలు కొలతలు శాఖ పనితీరును ఆయన సమగ్రంగా సమీక్ష చేశారు. వినియోగ దారుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం తనిఖీ చేయాలని ఆయన అధికారులను ఆదేశిం చారు. పెట్రోల్ బంకులలో తూకం మోసాలు పెరుగుతున్నాయని వాటిపై ప్రత్యేక నిఘా పెంచాలని ఆయన సూచించారు. తూనికలు కొలతలు శాఖపై ప్రజలకు అవగాహన లేదని ఈజి ఆఫ్ డూయింగ్ బిజినెస్ చట్టం పేరుతో వినియోగదారుల హక్కులకు భంగం కలిగిచడం కూడా మంచిది కాదని ఆయన అన్నారు. తూనికలు కొలతలశాఖ వివిధ కేటగిరిలలో ఉన్న ఖాళీల సమాచారం తాజాది సేకరించాలని ఆయన సూచించారు.

తూనికలు కొలతలు శాఖకు ఖాళీలు ఉండటం వల్ల కూడా వినియోగదారుడు మా ర్కెట్‌లో దగా పడుతు న్నారని గత పదేళ్ళుగా ఈ శాఖను పూర్తిగా నిర్లక్ష్యంచేశారిన ఆవేదన చెందారు. వెంటనే తూనికలు కొలతలుశాఖ ఖాళీలు భర్తీకి సన్నాహాలు చేపట్టడానికి ప్రభుత్వం ముందు ప్రతిపాదనలు పెడుతామని తెలిపారు. పెట్రోల్ బంకుల్లో వెయింగ్ మిషన్‌లు తరుచుగా ట్యాంపరింగ్ చేస్తున్నారని ఆరోపణల వస్తున్నాయని వాటిపై నిఘా పెట్టాలని సూచించారు. కొన్ని ఎలక్ట్రానిక్ కాంటాలు బ్యాటరీలు వీక్ అవడంతో కూడా తప్పుడు తూకాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రజలు తూకంలో మోసంకు గురికాకుండా చూడాలని సూచించారు. కిరాణంకొట్టు, కూరగాయల మార్కెట్ నుంచి మొదలు కొని ఎక్కడ కూడా శాస్త్రీయ ప్రమాణాలతో కూడిన తూకంరాయిని మాత్రమే వాడాలని మంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు.

# హైడ్రా కూల్చివేతలకు ఫోరం ఫర్ గుడ్‌గవర్నెన్స్ మద్దతు

### సామాన్యులు నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** జంట నగరాలతోపాటు శివార్లలో చెరువులు, కుంటలను ఆక్రమించి ఉన్న అక్రమ నిర్మాణాలను కొత్తగా ఏర్పాటైన హైడ్రా కూల్చివేస్తుండడాన్ని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ స్వాగతిం చింది. హైడ్రా చర్యలకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ మద్దతు ఇస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి పద్మనాభ రెడ్డి తెలి పారు. ఈ మేరకు మంగళవారం నాడు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలకు ఉపయోగపడే చెరువులు, కుంటలను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిం దేనని, ఇక్కడ వున్న అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందేనని ఆయన తెలిపారు. ఈ విషయంలో సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని ఆయన అభినందించారు. హైడ్రా ఏర్పాటును ఆయన స్వాగతించారు. జంట నగరాలు, శివార్లే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా చెరువులు, కుంటల ఆక్రమణలను పూర్తిగా తొ లగించాలని, వీటికి పూర్వ వైభవం తేవాలని ఆయన కోరారు. చెరువులు, కుంటల్లో ఆక్రమణలను తొలగించాక అందులో వున్న వ్యర్థాలను తొలగించి, వరదనీరు నిలు వ వుండేలా చూడాలని, అలుగు పారేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. చెరువులు, కుంటల్లో నీరు నిలువ వుండడం వల్ల ఆయా ప్రాంతాలలో భూగర్భ జ లాలు పెరుగుతాయని, పర్యావరణం సమతుల్యంగా వుంటుందని ఆయన తెలిపారు. చెరువులు, కుంటలతో పాటు ప్రభుత్వ భూములను కొందరు బిల్డర్లు ఆక్రమించి వాటిని సామాన్యులకు అమ్మారని, వీటిని సక్రమమైనవిగా ప్రభుత్వ విభాగాల అధికారులు ఆమోదం తెలిపారని, ఇక్కడ ఏర్పాటైన ప్లాట్లకు బ్యాంకులు రుణాలు కూడా ఇచ్చాయని ఈ సమయంలో హైడ్రా వాటిని కూల్చి వేయడం వల్ల వేలాది మంది అమాయకులు నష్ట పోతున్నారని పద్మనాభ రెడ్డి తెలిపారు. ఇలా జరగడానికి బిల్డర్లతో పాటు ప్రభుత్వ విభాగాల అధికారుల పాత్ర వుందని, వీరందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ తరహా ఘటనలకు కారకులైన వారిని వ దలవద్దని ఆయన కోరారు. ఇదే సమయంలో చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని నష్టపోయిన వారికి బిల్డర్ల నుంచి ప్రభుత్వం నష్ట పరిహారం ఇప్పించాల ని, వీలైతే సమీపంలోని ప్రభుత్వ స్థలాల్లో వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

### మహిళలపై వేధింపులకు పాల్పడితే

# కఠినంగా వ్యవహరించాలి

### లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై వర్క్‌షాప్

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ (హెచ్‌సిఎస్‌సి) ఆధ్వర్యంలో లైంగిక వేధింపుల నిరోధక చట్టం (2013)పై మంగళవారం వర్క్‌షాప్ జరిగింది. రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో జరిగిన ఈ వర్క్ షాప్‌లో సిటీ కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డితోపాటు మహిళా భద్రతా విభాగం డిజి శిఖాగోయల్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిటీకొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులను నిరోధించాలని, ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ విభాగాలతోపాటు కార్పొరేట్ సంస్థల్లో పనిచేసే వారికి లైంగిక వేధిం పుల నిరోధక చట్టంపై అవగాహన కలిగించేందుకు హెచ్‌సిఎస్‌సి ఆ ధ్వర్యంలో వర్క్‌షాప్ ఏర్పాటు చేశామని, ఈ చట్టంపై అందరికి అవగాహన కలిగించడం వర్క్‌షాప్ ముఖ్యఉద్దేశమని ఆయన అన్నారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు సంస్థల్లో పనిచేసే మహిళలకు సురక్షిత వాతావరణం వుండేలా చూడాల్సిన అవసరం వుందని ఆయన తెలి పారు. మహిళా భద్రతా విభాగం డిజి శిఖా గోయల్ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అన్ని విభాగాలు అవగాహన పెంచు కోవా లని అన్నారు. మహిళలపై ఎక్కడా వేధింపులు వుండకూడ దని, ఎక్కడైనా ఎలాం టి ఘటనలు జరిగినా వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ తరహా వర్క్‌షాప్‌ల వల్ల ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేసే వారికి చట్టాల గురించి తెలుసుకునే అవకాశం వుంటుందని, లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలనే దానిపై అవగాహన ఏర్పడు తుందని ఆమె తెలిపారు. మొదటి వర్క్‌షాప్‌లో పలు కార్పొరేట్ సంస్థల నుంచి వంద మంది మహిళలు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఒక్కో నిమిషం వ్యవధి కలిగిన పది చిన్న వీడియోలను శిఖా గోయల్ విడుదల చేశారు. ఈ వీడియోలు ఆహుతులను ఆకట్టుకు న్నాయి. ఈ వీడియోలు సినిమా థియేటర్లతో పాటు బహిరంగ ప్రదేశాలల్లో ప్రదర్శించేలా చూస్తా మని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరా బాద్ మహిళా భద్రతావిభాగం డిసిపి కవిత, హెచ్‌సిఎస్‌సి సంయుక్త కార్యదర్శి శ్రీకాంత్, మహిళా భద్రతకన్వీనర్ గీతాకోటి తదితరులు పాల్గొన్నారు.



లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై హెచ్‌సిఎస్‌సి ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సిటీకొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మహిళా భద్రతా విభాగం డిజి శిఖాగోయల్ తదితరులు

## 'మలబార్ గోల్డ్'కు ఇండియా గోల్డ్ కాన్ఫరెన్స్ రెస్పాన్సిబుల్ జ్యుయెలరీ హౌజ్ అవార్డు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అతిపెద్ద అభరణాల వ్యాపార సంస్థలో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ 2023-24 సంవత్సరానికి ప్రతిష్టాత్మకమైన ఇండియా గోల్డ్ కాన్ఫరెన్స్ రెస్పాన్సిబుల్ జ్యువెలరీ అవార్డు గెలుచుకొంది. బంగారంను బాధ్యతయుతమైన వనరుల నుంచి సేకరించి వ్యాపార కార్యకలాపాలను సుస్థిరంగా చేయడం వంటి అంశాలకు కారణంగా అత్యంత గౌరవనీయమైన ఈ అవార్డు మలబార్ గోల్డ్ డైమండ్‌కు లభించింది. మలబార్ గోల్డ్ డైమండ్ బాధ్యతయుతమైన గనుల నుంచి తవ్విన మరియు చట్టబద్ధమైన మూలాల నుంచి బంగారం వజ్రాలు సేకరించడం జరుగుతుంది. ప్రతి ఆభరణం నాణ్యతతో అంకిత భావంతో అత్యున్నత ప్రమాణాలతో తయారించడం మలబార్‌గోల్డ్ డైమండ్స్ ప్రత్యేకత ఈ సంస్థకు ఉంది. స్వచ్ఛత, సమగ్రత ఖచ్చితత్వం ప్రామాణికంగా తీసుకొని బెంగుళూర్‌లోని హిల్టన్ మాన్యత బిజినెస్ పార్క్‌లో జరిగిన కార్యక్రమంలో ఇండియా గోల్డ్ పాలసీ సెంటర్ చైర్మన్ డా.సుందరపల్లి నారాయణస్వామి నుంచి మలబార్ గోల్డ్, డైమండ్ ఇండియా ఆపరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఓ ఆషర్ అవార్డు అందుకున్నారు. మలబార్ గోల్డ్ బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ సీతారామన్ వరదరాజన్, దిలీప్‌నారాయణన్, సునీల్‌కశనయవప్, ప్రవీణ్‌బైజ్‌నాథ్, ఫిల్సర్‌బాబు, ఎంపి అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు.






# కాకతీయుల కళా సంపదను కాపాడుకోవాలి

### గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

### స్వాగతం పలికిన కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే

### గణపేశ్వరాలయం కోటగుళ్లలో ప్రత్యేక పూజలు

### పూర్ణకుంభంతో స్వాగతం పలికిన అర్చకులు

### ఆలయ ఆవరణలో తవ్వకాల్లో బయటపడిన విగ్రహాలను పరిశీలించిన గవర్నర్

**గణపురం, ఆగస్టు 27, ప్రభాతవార్త:** కాకతీయులు నిర్మించిన కాకతీయుల కట్టడాలను రక్షించి ముందు తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండల కేంద్రంలోని కోటగుళ్ళు గణపేశ్వరాలయాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సందర్శించారు. జిల్లాకు విచ్చేసిన గవర్నర్‌కు జిల్లా కలెక్టరన రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులచే గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్‌కు వేదపండితులు పూర్ణకుంభం, మేళా తాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రమీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్, భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట రావులతో కలిసి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గణపేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు శాలువాతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం గణపేశ్వరాలయం ఆవరణలో తవ్వకాలలో బయటపడ్డ శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ… కాకతీయుల వైభవాన్ని చాటి గొప్ప కట్టడం గణపేశ్వరాలయం అని, సుమారు 12వ శతాబ్దంలో కాకతీయులు ఓరుగల్లు ప్రాంతాన్ని పరిశీలించిన సమయంలో ప్రజల సౌకర్యార్థం అద్భుతమైన కట్టడాలను నిర్మించారని అన్నారు. కాకతీయుల ఇతర రాజ్యాలపై దండయాత్ర చేసి సాధించిన విజయానికి గుర్తుగా ఒక్కొక్క గుడిని నిర్మించారని తెలిపారు. కాకతీయుల కళా సంపదను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని గవర్నర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కవితకు బెయిల్ అందరూ ఊహించిందే

### మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్య

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** రాష్ట్రానికి సంబంధించి ఎలాంటి ప్రయోజనం లేకపోయినా రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ తెలంగాణను బీజేపీకి తాకట్టు పెట్టిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కైనందువల్లే కవితకు బెయిల్ వచ్చిందనీ, ఇది అందరూ ఊహించిందేనని వ్యాఖ్యానించారు. ఈమేరకు మంగళవారం ఇక్కడ విడుదల చేసిన ప్రకటనలో గత 10 సంవత్సరాలుగా కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉందనీ, ఢిల్లీలో దోస్తీ గల్లీలో కుస్తీ అని తాము ఎప్పటి నుంచో అంటున్న మాటలు కవితకు బెయిల్‌తో నిజమయ్యాయన్నారు. కేంద్రంలో బీజేపీ పెట్టిన ప్రతి బిల్లుకు బీఆర్‌ఎస్ ప్రత్యేక విమానంలో వెళ్లి సహకరించిందనీ, అదే తరహాలో 160 రోజులు జైల్లో ఉన్న కూతరును విడిపించుకోవడానికి తిరిగి బీజేపీ శరణుజొచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను నివారించడానికి గత పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్‌ఎస్ సహకరించిందనీ, అందుకే తెలంగాణలో ఉనికే లేని బీజేపీకి 8 సీట్లు వచ్చాయని ఈ సందర్భంగా మంత్రి పొన్నం వ్యాఖ్యానించారు.

## 171 మందితో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మెరిట్ జాబితా విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వెటర్నరీ శాఖలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(క్లాస్-ఏ, బి) పోస్టులకి ఎంపికైన అభ్యర్థుల మెరిట్ జాబితాను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్‌సీ) ప్రకటించింది. 171 మంది మెరిట్ అభ్యర్థుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెటర్నరీ శాఖలోని వెటర్నరీ అసిస్టెంటన సర్జన్(క్లాస్-ఏ, బీ) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ నంబర్ 23-2022ను డిసెంబర్ 22, 2022ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ పోస్టులకి ఎంపికైన 171 మంది మెరిట్ అభ్యర్థుల జాబితాను ప్రకటించారు.

## డెంగ్యూ కట్టడికి కంట్రోల్ రూం

### ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలి

### సీజనల్ వ్యాధులపై మంత్రి దామోదర ఉన్నతస్థాయి సమీక్ష



సచివాలయంలో మంగళవారం సీజనల్ వ్యాధుల కట్టడిపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల కట్టడికి వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. డెంగ్యూ కట్టడికి రాష్ట్రస్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలనీ, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మంగళవారం సీజనల్ వ్యాధుల కట్టడిపై సచివాలయంలో మంత్రి దామోదర ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో రాష్ట్రంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు, వాటి నియంత్రణపై ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగ్యూ కేసుల కట్టడికి ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలనీ, డెంగ్యూ కట్టడిపై ప్రజలకు అవగాహన కలిగించాలని పేర్కొన్నారు. డెంగ్యూ కట్టడిపై వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు జిల్లాలలో పర్యటించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా డెంగ్యూ కేసులు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ సంఖ్యలో నమోదవుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి డా.క్రిస్టినా చొంగ్తు, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వి కర్ణన్, వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండి వాసుదేవరావు, డీఎంఈ డా.వాణి, ఎంఎస్‌ఐఎస్‌డిసి చీఫ్ ఇంజనీర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# డిఎస్సీలో స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు సర్టిఫికెట్లను సమర్పించాలి

### నేటి నుంచి సెప్టెంబర్ 2 లోపు..

### పాఠశాల విద్య డైరెక్టర్ నరసింహారెడ్డి

### నెలాఖరులో ఫలితాలు విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన డిఎస్సీ-2024లో స్పోర్ట్స్ కోటాలో పోస్టుల భర్తీ కోసం వారు స్పోర్ట్స్ సర్టిఫికెట్స్‌ను సమర్పించాలని పాఠశాల విద్య డైరెక్టర్ ఆదేశించారు. అభ్యర్థుల దగ్గర ఉన్న ఇంటర్నేషనల్, మల్టీనేషనల్, నేషనల్ స్పోర్ట్స్ సర్టిఫికెట్స్‌ను నేటి(ఆగస్టు 28) నుంచి సెప్టెంబర్ 2 లోపుగా పాఠ శాల విద్య శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పాఠశాల విద్య డైరక్టర్ ఈవి నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఫామ్-1లో ఎస్‌జీటీ కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఫామ్-2లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం 2012 ఆగస్టు 9న జారీ చేసిన జీవో ఎంఎస్ నంబర్ 74 ప్రకారం సర్టిఫికెట్స్ పరిశీలన ఉంటుందని స్పష్టం చేశారు. అయితే ఇప్పటికే డీఎస్‌సీ-2024కి సంబంధించిన ప్రా థమిక కీని విడుదల చేసిన విషయం తెలిసిందే. స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ), లాంగ్వేజ్ పండిట్(ఎల్‌పీ), సెకండరీగ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ), ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) పోస్టులకి సంబంధించి వేర్వేరుగా ప్రాథమిక కీని విడుదల చేశారు.

అభ్యర్థుకి సంబంధించిన రెస్పాన్స్ షీట్స్‌ని పాఠశాల విద్య శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచినట్టు పాఠశాల విద్య డైరక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్‌సీ-2024కి సంబంధించిన ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఈ నెల 20వ తేది సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించారు. సుమారు 28వేలకి పైగా దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది. మొదటిసారిగా డీఎస్‌సీ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) విధానంలో నిర్వహించారు. 11,062 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన డీఎస్‌సీ పరీక్షలు జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు జరిగాయి. డీఎస్‌సీ-2024 పరీక్షలకి 87.61 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలకి 2,79,957 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 2,45,263 మంది హాజరయ్యారు.

స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) పరీక్షలకి 1,37,872 (85.24 శాతం) మంది.. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పరీక్షలకి 81,053 (92.10 శాతం) మంది.. లాంగ్వేజ్ పండిట్స్(ఎల్‌పీ)కి 16,092 (88.36 శాతం) మంది.. ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(పీఈటీ) పరీక్షలకి 10,246 (85.41 శాతం) మంది హాజరయ్యారు. అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం ఫైనల్ కీని విడుదల చేయనున్నారు.

ఫైనల్ కీ ఆధారంగా జనరల్ ర్యాంకింగ్ లిస్టును ఈ నెలాఖరులోగా విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

### కవితకు బెయిల్..

## కెటిఆర్, హరీశ్‌రావులకు కెసిఆర్ ఫోన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 27:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్ట్ అయిన తన కూతురు కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు. తనయుడు,పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, సీనియర్ నేత హరీశ్‌రావుతో కెసిఆర్ ఫోన్‌లో మాట్లాడారు. కూతురు బాగోగులు తెలుసుకున్నారు. కవిత అరెస్టయిన మొదట్లో కెసిఆర్ ఈ అంశంపై స్పందించలేదు. ఆమె అరెస్ట్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన తన కూతురును కలవలేదు. అయితే లోక్‌సభ ఎన్నికలకు ముందు కవిత అరెస్ట్‌పై ఆయన స్పందించారు. కూతురు అరెస్ట్ అయితే ఓ తండ్రిగా బాధ ఉండదా? అని వాపోయారు. తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి దొరికిపోయిన బిజెపి తన కూతురును ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఇరికించిందని ఆయన ఆరోపించారు. కవిత అడిగిన ముత్యంలా బయటకు వస్తుందన్నారు.

## 30న బిజెపిలోకి చంపయ్ సోరెన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** అసెంబ్లీ ఎన్నికలు మరికొన్ని నెలల్లో సమీపిస్తున్న క్రమంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే జార్ఖండ్‌మాజీ సీఎం చంపయిసోరెన్ ఆగస్టు 30వ తేదీ రాంచీలో అధికారికంగా భారతీయ జనతాపార్టీలోచేరనున్నారు. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ తన అధికారిక ఎక్స్ ఖాతాలో ఒక పోస్టుచేసి సంచలనం రేపారు. చంపయి సోరెన్ హోంమంత్రి అమిత్‌షాతో సమావేశం అయ్యారని ఆయన తన పోస్ట్‌లో తెలిపారు. చంపై సరెన్ సోమవారమే ఢిల్లీకిచేరుకుని బిజెపి సీనియర్‌నేతలతో భేటీ అయ్యారు. గతవారం రోజులుగా ఆయన ఢిల్లీకి వెళ్లడం ఇది రెండోసారి. అంతకుముందు ఢిల్లీకిచేరిన చంపయి సోరెన్ పార్టీ నాయకత్వం తనను అవమానించిందని ఆరోపించారు. నిరంతర అవమానకర ప్రవర్తన కారణంగా ఉద్వేగానికి లోనై రాజకీయాల్లో కొత్త ఎంపిక అవసరమని నిర్ణయించుకున్నానన్నారు. తనబాధను పంచుకుంటూ నిరంతర అవమానాలు ధిక్కారాల తర్వాత రాజకీయాలనుంచి విరమించుకోవడం తన సొంత సంస్థనను స్థాపించడం లేదా కొత్తభాగస్వామితో ప్రయాణించడం వంటివాటిని చంపై ప్రస్తావించారు. అవమానం, తిరస్కరణ కారణంగా తానుప్రత్యామ్నాయం వెదుక్కోవాల్సి వచ్చిందన్నారు. నేటినుంచి తనజీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభం అవుతుందన్నారు.

## ప్రైవేటులో 70 శాతానికిపైగా అడ్మిషన్లు!

### సౌకర్యాలు, అధ్యాపకుల కొరతతో ప్రభుత్వ విద్యాసంస్థలు

### ప్రైవేటు సంస్థలకి పంపుతున్న తల్లిదండ్రులు

### చదువుకోసమే ఎక్కువ ఖర్చు పెడుతున్న ప్రజలు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యా సంస్థల కంటే ప్రైవేటు విద్యా సంస్థల్లోనే విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంది. 1వ తరగతి ఉంచి పీజీ వరకు, ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్య కోర్సుల్లో మొత్తంగా చేరిన విద్యార్థుల్లో 70 శాతానికిపైగా ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరగా.. కేవలం 30 శాతం మంది మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేరుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఈ శాతం మరీ పెరుగుతూ వస్తోంది. ప్రభుత్వ విద్యా సంస్థల్లో సౌకర్యాల కొరతతోపాటు.. బోధించడానికి సరిపడా అధ్యాపకులు లేకపోవడంతో.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ విద్యా సంస్థల్లో చేర్చడం కంటే కూడా ఖర్చు అయినా సరే ప్రైవేటు విద్యాసంస్థల్లోనే చేర్చుతున్నారు. రాష్ట్రంలో 30,143 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉంటే వాటిల్లో గత ఏడాది 2023-24 విద్యా సంవత్సరంలో 26,36,630 మంది విద్యార్థులు చేరారు. అదే ప్రైవేటులో 10,832 పాఠశాలలు ఉంటే వాటిలో 34,05,430 మంది విద్యార్థులు చేరారు. ప్రభుత్వ విద్యా సంస్థల కంటే ప్రైవేటు స్కూల్స్‌లో అదనంగా సుమారు 8 లక్షలకిపైగా విద్యార్థులు చేరారు. ఇక రాష్ట్రంలోని జూనియర్ కాలేజీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో 425 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉంటే వాటిలో ఇప్పటి వరకు సుమారు 88వేల మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరారు. ఇక ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలు సుమారు 1400 వరకు ఉండగా.. వాటిలో సుమారు 4 లక్షల మంది విద్యార్థులు చేరారు. జూనియర్ కాలేజీల్లో మొత్తం 10 లక్షల మంది మొదటి, ద్వితీయ సంవత్సరంలో ఉంటే వారిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1.80 లక్షల మంది ఉండగా.. ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో సుమారు 8 లక్షకిపైగా ఉంటున్నారు. అయితే రాష్ట్రంలో ఉన్న వివిధ గురుకుల కాలేజీల్లో సుమారు 1.20 లక్షల మంది చేరుతున్నారు. ఇక డిగ్రీ కాలేజీల్లో చూసుకుంటే రాష్ట్రంలోని 129 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో సుమారు 52,000 మంది చేరుతున్నారు.

## ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సు ప్రవేశాల్లో స్థానికత జిఒపై హైకోర్టులో విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 27:** ఎంబిబిఎస్, బిడిఎస్ కోర్సు ప్రవేశాల్లో స్థానికత జీవోకు సంబంధించి హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వైద్య ఆరోగ్య శాఖ జారీ చేసిన జీవోను సవాల్ చేస్తూ పలువురు విద్యార్థులు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాదె, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావులతో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. నీట్ ప్రవేశ పరీక్ష రాసే సమయానికి విద్యార్థి వరుసగా నాలుగేళ్లు చదివితేనే స్థానికుడిగా పరిగణించాలంటూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ జీవో రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమంటూ పిటిషనర్లు తరఫు న్యాయవాదులు వాదించారు. అహ్మదాబాద్ మహానగర పరిధిలోనూ ఇలాంటి జీవోనే విడుదల చేయడంతో అక్కడి హైకోర్టు కొట్టివేసిందని పిటీషనర్ తరఫు న్యాయవాది మయూర్‌రెడ్డి ధర్మాసనానికి తెలిపారు. నీట్‌లో ర్యాంకు సాధించాలనే ఉద్దేశ్యంతో మంచి కాలేజీలో చదువుకోవడానికి విద్యార్థులకు ఇతర రాష్ట్రాలకు వెళ్లొచ్చని, తల్లిదండ్రులు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇతర రాష్ట్రాలకు వెళితే పిల్లలు కూడా వాళ్లతోపాటు వెళ్లాల్సి వస్తోందని కోర్టుకు తెలిపారు. ఓ విద్యార్థి ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఇక్కడే చదివాడని, తండ్రికి మహారాష్ట్ర బదిలీ కావడంతో అక్కడ పదో తరగతి నుంచి 9వ తరగతి వరకు ఇక్కడే చదివాడని, తండ్రికి మహారాష్ట్ర బదిలీ కావడంతో అక్కడ పదో తరగతి మాత్రమే చదివాడని, తిరిగి ఇంటర్మీడియట్ ఇక్కడే చదివినా ప్రభుత్వ నిబంధనల దృష్ట్యా ఎంబిబిఎస్ సీటుకు నాన్ లోకల్ కింద పరిగణిస్తున్నారని కోర్టుకు తెలిపారు. తెలంగాణలో పుట్టి పెరిగి ఇక్కడే పదో తరగతి వరకు చదవి, ఇంటర్మీడియట్ ఇతర రాష్ట్రాల్లో చదివినంత మాత్రాన నాన్‌లోకల్ కింద పరిగణించడం నిబంధనలకు విరుద్ధమని పిటీషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. తదుపరి విచారణను హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది.

# 12 మంది సభ్యుల ఏకగ్రీవ ఎన్నికతో రాజ్యసభలో ఎన్డీయేకు పెరిగిన బలం



**న్యూఢిల్లీ, ఆగస్టు 27:** కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే నుంచి 12 మంది రాజ్యసభకు పోటీలేకుండా ఎన్నిక కావడంతో ఇపుడు రాజ్యసభలో మెజార్టీ మార్కును బిజెపి, ఎన్డీయే కూటమి సాధించింది. మొత్తం తొమ్మిదిమంది బిజెపినుంచి ఎన్డీయే ఇతర మిత్రులనుంచి ముగ్గురు ఎన్నిక కావడంతో రాజ్యసభలో ఇపుడు బలం ఎన్డీయేకు 112కి పెరిగింది. బిజెపికి సొంతంగా మెజార్టీ 96కి చేరింది. ఇతర పార్టీలయిన ఎన్సీపీ అజిత్‌పవార్‌వర్గం, రాష్ట్రీయ లోక్‌మంచ్‌నుంచి ముగ్గురు సభ్యులుఎ న్నికయ్యారు. ఎన్డీయేకు రాజ్యసభలో నామినేటెడ్ ఆరుగురుఎంపిలు, ఒక స్వతంత్ర ఎంపీ కూడా మద్దతు ఇస్తున్నారు. కాంగ్రెస్ పార్టీనుంచి ఒక ఎంపి అభ్యర్థిక ఎన్నికకాగా ప్రతిపక్ష సభ్యుల సంఖ్య రాజ్యసభలో 85కి చేరింది. రాజ్యసభలో 245 స్థానాలున్నాయి. ప్రస్తుతంఎనిమిది ఖాళీలున్నాయి. నాలుగు జమ్ముకాశ్మీర్; మరో నాలుగు నామినేటెడ్ పదవులున్నాయి. దీనితో ప్రస్తుతం సభ్యులసంఖ్య 237కి తగ్గింది. ఇపుడు మెజార్టీ మార్కు కూడా 119కావాల్సి ఉంది. పోటీలేకుండా ఎన్నికయిన బిజెపి సభ్యులు అస్సాం నుంచి రామేశ్వర్ తేలి, మనన్‌కుమార్‌మిశ్రా బీహార్‌నుంచి హర్యానానుంచి కిరణ్‌చౌదరి, మధ్యప్రదేశ్‌నుంచి జార్జికురియన్, మహారాష్ట్రనుంచి ధిర్యాశీల్ పాటిల్, ఒడిశానుంచి మమతా మోహంతా, రాజస్థాన్‌నుంచి రవ్‌నీత్‌సింగ్ భిట్టు, త్రిపురనుంచి రాజీవ్‌భట్టాచార్జీలు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీనుంచి అభిషేక్‌మనుసింఘ్వీ తెలంగాణనుంచి పోటీలేకుండా ఎన్నికయ్యారు. ఎన్సీపీ అజిత్‌పవార్ వర్గంనుంచి నితిన్‌పాటిల్ మహారాష్ట్రనుంచి ఎన్నికకాగా ఆర్ఎల్ఎం ఉపేంద్ర కుష్వాహా బీహార్‌నుంచి ఎన్నికయ్యారు. గడచిన దశాబ్దకాలంగా ఎన్డీయే మెజార్టీ మార్కును దాటేందుకు కృషిచేస్తోంది. దీనివల్ల అనేకకీలక బిల్లులు ఆమోదం కాకుండా నిలిచిపోతుండటంతో ఇపుడు మెజార్టీ మార్క్‌పై ఫోకస్‌పెట్టి తన బలం పెంచుకోగలిగింది. నవీన్ పట్నాయక్ బిజు జనతాదళ్, జగన్మోహన్ రెడ్డివైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు బయటిఉంచి మద్దతిస్తుండటంతో మెజార్టీతో బిల్లులు పాస్‌చేసకునే స్థాయి లభించింది. అయితే ఈ రెండుపార్టీలు కూడా ఇపుడు రాష్ట్రాల్లో అధికారంచేజార్చుకుంటున్నాయి. ఇపుడు జెడియు నితీష్ పార్టీ, చంద్రబాబునాయుడు టిడిపి పార్టీలు ఎన్డీయేకే మద్దతిస్తుండటంతోమెజార్టీ భయం లేకుండాపోయింది.

## కవితకు బెయిల్ ఇప్పించిన కాంగ్రెస్‌కు అభినందనలు

### బండి సంజయ్ వ్యాఖ్యలు

### సంజయ్ వ్యాఖ్యలను కోర్టు ధిక్కార చర్యగా భావించి చర్యలు తీసుకోవాలి: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు27:** బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంపై కేంద్ర సహాయ మంత్రి,బిజెపి నేత,కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. కవితకు బెయిల్ లభించినందుకు కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ న్యాయవాదులకు అభినందనలు తెలిపారు. మీ అలుపెరగని ప్రయత్నాలు చివరకు ఫలించాయని చురక అంటించారు. ఈ బెయిల్ బిఆర్ఎస్, కాంగ్రెస్... రెండు పార్టీల విజయమని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ నాయకురాలు బెయిల్‌పై బయటకు వచ్చారని, ఇక కాంగ్రెస్ వ్యక్తి రాజ్యసభకు వెళతారని వ్యాఖ్యానించారు. కవితకు బెయిల్ కోసం కోర్టులో వాదనలు వినిపించిన కాంగ్రెస్ అభ్యర్థిని ఏకగ్రీవంగా రాజ్యసభకు నామినేట్ చేయడానికి కెసిఆర్ అద్భుతమైన రాజకీయ చతురత ప్రదర్శించారన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ వ్యాఖ్యలను తప్పుబట్టారు. కవితకు బెయిల్ లభించినందుకు కాంగ్రెస్ పార్టీకి,ఆ పార్టీ న్యాయవాదులకు అభినందనలు అంటూ బండి సంజయ్ వ్యాఖ్యలపై కెటిఆర్ తీవ్రంగా స్పందించారు.

బండి సంజయ్ కేంద్ర హోం శాఖ వ్యవహారాల సహాయ మంత్రిగా ఉన్నారని,మరోవైపు సుప్రీంకోర్టు తీర్పుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఎక్స్ వేదికగా కెటిఆర్ పేర్కొన్నారు. మీ స్థాయికి ఇది తగిన వైఖరి కాదని బండి సంజయ్‌ని ఉద్దేశించి పేర్కొన్నారు. గౌరవనీయులైన భారత ప్రధాన న్యాయమూర్తి, గౌరవ సుప్రీంకోర్టు బండి సంజయ్ వ్యాఖ్యలను కోర్టు ధిక్కార చర్యగా భావించి అందుకు అనుగుణంగా చర్యలను ప్రారంభించాలని కోరుతున్నామని పేర్కొన్నారు.

అంతకు ముందు కెటిఆర్ మరో ట్వీట్ చేశారు. కవితకు బెయిల్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. 'థ్యాంక్యూ, సుప్రీంకోర్టు... ఉపశమనం లభించింది. న్యాయం గెలిచింది' అని ట్వీట్ చేశారు.

## 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్: శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 27:** సెప్టెంబర్ 5,6 తేదీల్లో గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఓ హోటల్‌లో మంగళవారం హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా) ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ ఏఐ రాజధానిగా నిలబెట్టే లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. సమ్మిళిత పరిష్కారాలను సృష్టించడానికి ఎఐ అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉందన్నారు. గణనీయమైన సానుకూల సామాజిక ప్రభావాన్ని నడిపించడానికి పరిశ్రమ నాయకులు, విధానకర్తలు,ఆవిష్కర్తల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ లక్ష్యాలను సాధించేందుకు తెలంగాణ సర్వసన్నదంగా ఉందని వెల్లడించారు. ఏఐని ఉపయోగించుకుంటున్నప్పుడు అది నిష్పాక్షికత, పాదర్శకత, జవాబుదారీతనంతో మానవాళికి సేవలందించేలా చూడాలన్నారు. త్వరలో ఏర్పాటు చేయబోయే నైపుణ్య విశ్వవిద్యాలయం,ప్రతిష్ఠాత్మక ఎఐ సిటీ లాంటి కార్యక్రమాలకు ఐటి పరిశ్రమ కూడా సహకరించాలి అని మంత్రి కోరారు. హైసియా అధ్యక్షుడు ప్రశాంత్ నాదెళ్ల మాట్లాడుతూ... కృతిమ మేధ నైపుణ్యాలతో పరిశ్రమకు సిద్ధంగా ఉన్న శ్రామిక శక్తిని సృష్టించడంపై దృష్టి సారించి శిఖరాగ్ర సమావేశానికి మద్దతు ఇవ్వడానికి హైసియా నిబద్ధతతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణణ్,ఐటీఈ అండ్ ఈ శాఖ సీఆర్వో అమర్‌నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీల్లోనూ స్పాట్‌అడ్మిషన్లు

## నేడు నోటిఫికేషన్ జారీ.. 29న పత్రికల్లో నోటిఫికేషన్

### 30 నుంచి సెప్టెంబరు 2 వరకు స్పాట్ అడ్మిషన్లు

**హైదరాబాద్, ఆగస్టు 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో ఈసారి విద్యార్థులకి శుభవార్త చెప్పింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు కాన్సిట్యూంట్ కాలేజీలు, యూనివర్సిటీ కాలేజీల్లోనూ స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించారు. గత ఏడాది వరకు రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకి మాత్రమే స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించే వారు. అయితే గత మూడు, నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలోని ఉస్మానియా ఇంజనీరింగ్ కాలేజీతోపాటు జేఎన్‌టీయూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఇంజనీరింగ్ కోర్సుల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. దీంతో ఆలోచించిన తెలంగాణ ఉన్నత విద్యా మండలి అధికారులు ప్రభుత్వానికి వివరించి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలతోపాటు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలకి, యూనివర్సిటీ కాలేజీలకి కూడా అవకాశం ఇస్తే బాగుంటుందని సూచించడంతో.. ప్రభుత్వం కూడా అంగీకరించడంతో.. ఈ ఏడాది 2024-25 విద్యా సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకి అవకాశం కల్పించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను సాంకేతిక విద్యా శాఖ కమిషనర్, ఎప్ సెట్ అడ్మిషన్ల కన్వీనర్ శ్రీదేవసేన మంగళవారం ప్రకటించారు. కాలేజీలు ఆయా కాలేజీల్లోని కోర్సుల్లో ఉన్న ఖాళీల సీట్లను ఈ నెల 28న ప్రకటించాలి. అదే రోజు నోటిఫికేషన్‌ను జారీ చేయాలి. 29న పత్రికల్లో నోటిఫికేషన్‌ను ప్రచురించేలా చూడాలి. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2 వరకు స్పాట్ అడ్మిషన్లను కొనసాగించాలి. సెప్టెంబర్ 3 వరకు స్పాట్ అడ్మిషన్ అభ్యర్థులు తమ వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 4 వరకు సీట్లు పొందిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను ఎప్‌సెట్-2024 అడ్మిషన్స్ కన్వీనర్ ఆఫీసు ఉన్న మాసబ్‌ట్యాంక్‌లో సమర్పించాల్సి ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని 175 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో 86,943 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 75,107 సీట్లు భర్తీ అయ్యాయి. మరో 11,836 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

## చేజారుతున్న పదవులు!

>> చెందుతున్నారు. నల్లగొండజిల్లా కు చెందిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొమటిరెడ్డి వెంకటరెడ్డి వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు వారి అసంతృప్తిని ప్రతి వేదికపై వ్యక్తంచేస్తున్నారు. మోహన్‌రెడ్డి శంకర్ నాయక్‌లకు నామినేటెడ్ పదవులు దక్కవా అంటూ క్షేత్రస్థాయిలో పార్టీజెండాను ఎంతో అభిమానంతో మోసిన కార్యకర్తలు ప్రశ్నిస్తుండటంతో పెద్దనాయకులు సమాధానం చెప్పలేకపోతున్నారు. నల్లగొండ జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచరగణంకు మాత్రమే ఎక్కువ పదవులు దక్కడంతో మంత్రులు ఉత్తమ్, కొమటిరెడ్డి కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి అవమాన భారంతో ఉన్నారు.

నల్లగొండ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రులను నమ్ముకొని ఇన్నాళ్ళు పదవులపై ఆశలు పెట్టుకొన్న నాయకుల భ్రమలు మెల్లమెల్లగా తొలగిపోతున్నాయి. క్షేత్రస్థాయిలో కార్యకర్తల అసంతృప్తిని గుర్తెరిగిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నామినేటెడ్ పదవులపై అధిష్ఠానంకు తన అభ్యతరం తెలిపినట్లు ప్రచారం జరుగుతోంది. దీనితో కొత్తగా పార్టీలో చేరిన వారికి వెంటనే పదవులు ఇవ్వడంపై హైకమాంగ్ అభ్యంతరం చెప్పింది. అంతే కాకుండా నామినేటెడ్ పదవి బాధ్యాత స్వీకరించకుండా నిలిపిపెట్టాలని రాష్ట్ర కాంగ్రెస్‌కు ఆదేశాలు జారీ చేసిందని ఒరిజినల్ కాంగ్రెస్ కార్యకర్తలలో చర్చ జరుగుతోన్నది. కాంగ్రెస్‌హైకమాండ్ నిర్ణయం ఇన్నాళ్ళు అప్రతిహతంగా ఏకపక్షంగానిర్ణయాలు తీసుకొంటూ పార్టీకి జవసాత్వాలు అందించి అధికారంలోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి,టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి తొలిసారి భంగపాటు కలిగించిందని పార్టీ శ్రేణులు చెవులు కొరుక్కుంటున్నాయి.

# హైడ్రా.. ఒక హైడ్రామా

## రుణమాఫీని మరిపించేందుకు సిఎం రాజకీయ కొత్త ఎత్తుగడ : బిజెపి ఎంపి ఈటల రాజేందర్

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు ముందు కాం గ్రెస్ పార్టీ దూకుడు స్వభావంతో ఆచారణకు ఆమోదయోగ్యం కానీ.. అధికారమే పరమవదిగా భావించి, రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలలో, గ్రామాలలో హామీల వర్షం కురిపించి, తొమ్మిది మాసాలు కావస్తున్న ఏ ఒక్క సంక్షేమ పథకం ప్రజలకు సంపూర్ణంగా చేయకుండా.. తొమ్మిది నెలల్లో విఫలమైన ఎనుముల రేవంత్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

ప్రభుత్వంపై రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగం ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో రైతు రుణమాఫీ నుండి డైవర్ట్ చేయడానికి రాష్ట్ర రాజధానిలో హైడ్రా అంటూ ఒక కొత్త హైడ్రామా మొదలు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. పాలనలో విఫలమైందని, రాష్ట్ర మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. మంగళవారం మొట్టమొదటిసారిగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల అనంతరం హుజు రాబాద్ నియోజక వర్గంలో ఈటల రాజేందర్ అడుగు పెట్టాడు. కమలాపూర్ తన ఇంటికి వచ్చిన ఈటల రాజేందర్ పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అక్షరాల మాటల ప్రభుత్వమని, చేతల ప్రభుత్వం కాదని, వాళ్లకు వాళ్లే నిరూపించుకున్నారని ఈటల రాజేందర్ దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో ఎన్నికల కన్న ముందు 65లక్షల మంది రైతులు ఉన్నారని, వారికి రైతుల రుణమాఫీకి 48వేల కోట్ల రూపాయల ఖర్చు అవుతుందని చెప్పిన రేవంత్‌రెడ్డి.. అధికారం వచ్చిన తర్వాత మాట మార్చి 45లక్షల మంది రైతులు ఉన్నారు.. 34వేల కోట్ల రూపాయల సరిపోతుందని చెప్పి.. చివరికి 31వేల కోట్లని తేల్చి చెప్పి.. ఇప్పటి వరకు కేవలం 17వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసినట్లు గ్రామాలలో ఇంటింటా చర్చలు జరుగుతుండడంతో జీర్ణించుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరిట.. హైడ్రామా మొదలు పెట్టినట్లు ఎంపి ఈటల రాజేందర్ అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నడు ఒక ఎమ్మెల్యేగా,... ఒక ఎంపిగా.. ఒక మంత్రిగా... ఏ పదవి సక్కగా చేయలేదు.. మాటలు చెప్పుకుంటూ.. గ్యారెడీ చేసుకుంటూ వచ్చి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి అదే డ్రామా.. అదే హైడ్రా.. అదే హైడ్రామా.. కథలు చెబుతున్నారని ఈటల తీవ్రంగా దుయ్యబట్టారు. భారతీయ జనతా పార్టీ ఆరు సంవత్సరాలకు ఒక సారి సభ్యత్వం చేస్తుందని.. ప్రపంచంలో అత్యధిక సభ్యత్వం ఉన్న పార్టీగా భారతీయ జనతా పార్టీ ఇప్పటికే రికార్డుకెక్కిందన్నారు. తెలంగాణలో ఇప్పటికే 11లక్షల 75వేల సభ్యత్వం బిజెపి పార్టీకి ఉందన్నారు.

## ఐసిసి ఛైర్మన్‌గా జైషా ఏకగ్రీవ ఎన్నిక

**దుబాయి, ఆగస్టు 27:** అంతర్జాతీయ క్రికెట్ మండలి ఐసిసి కొత్త ఛైర్మన్‌గా జైషా ఎన్నికయ్యారు.




బిసిసిఐ కార్యదర్శిగా ఉన్న ఆయన ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. డిసెంబరు ఒకటినుంచి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ఐసిసి ఛైర్మన్‌గా ఎన్నికైన అతిపిన్న వయస్కుడిగా జైషా (35) గుర్తింపు దక్కించుకున్నారు. భారత్‌నుంచి అంతర్జాతీయ క్రికెట్‌మండలి ఛైర్మన్‌గా ఎన్నికైన ఐదో వ్యక్తిప్రస్తుతం ఛైర్మన్‌గా గ్రెగ్ బార్క్‌లే కొనసాగుతున్నారు. ఆతడు మరో దఫా ఛైర్మన్‌గా కొనసాగడానికి అర్హత ఉన్నా కొనసాగడానికి విముఖత చూపించారు. దీనితో తాజాగా జరిగిన ఎన్నికల్లో జైషా ఏకగ్రీవం అయ్యారు. ఈసందర్భంగా జైషా మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి కృషిచేస్తానని అన్నారు. ఐసిసి ఛైర్మన్‌గా నామినేట్ అయినందుకు చాలా ఆనందంగా ఉంది. ఐసిసి బృందం, సభ్యదేశాలతో కలిసి క్రికెట్‌ను విశ్వవ్యాప్తంచేసేందుకు కట్టుబడి ఉంటానన్నారు. క్రికెట్‌లోని ఫార్మాట్లమధ్య సమన్వయం దెబ్బతినకుండాచూసేందుకు అవసరమైతే సరికొత్త సాంకేతికతను అందుబాటులోకి తెస్మాన్నారు. గతంలో లేనంతగా క్రికెట్‌ను అంతటా విస్తరింపచేయడమే మా లక్ష్యం. 2028లో లాస్‌ఏంజెల్స్‌లోజరిగే ఒలింపిక్స్‌లోక్రికెట్‌నుప్రవేశపెట్టడం ఈ ఆట అభివృద్ధిపరంగా గొప్ప విప్లవాత్మకనిర్ణయం. దానితో క్రికెట్‌మరింత పురోగతి చెందుతుందనే నమ్మకం ఉందని జైషా వెల్లడించారు. బిజెపి సీనియర్‌నాయకుడు,కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కుమారుడైన జైషా 2019అక్టోబరులో బిసిసిఐ కార్యదర్శిగా బాధ్యతలుచేపట్టాడు. అప్పటినుంచి ఆయన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 2021జనవరినుంచి ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్‌గా షా సేవలందిస్తున్నాడు. ఇపుడు ఐసిసి ఛైర్మన్‌గా ఎంపికయిన నేపథ్యంలో బిసిసిఐ కొత్తకార్యదర్శి ఎవరన్న విస్తృతప్రచారానికి తెరలేచింది. ఐసిసి ఛైర్మన్‌గా గ్రెగ్ బార్క్లే పదవీకాలం నవంబరుతో ముగుస్తుంది. ఇప్పటికే రెండు పర్యాయాలు ఈపదవిలో ఉన్న గ్రెగ్ ఇకవైదొలగాలని నిర్ణయించాడు. అందువల్ల కొత్త బాస్ ఎంపిక అనివార్యమైంది. ఐసిసి పీఠంపై జైషా కన్నేసాడన్న వార్తలు వచ్చిన నేపథ్యంలో షా ఎన్నిక పక్కా అనిబార్క్లే కూడా ప్రకటించాడు. ఆయన చెప్పినట్లుగానే మంగళవారం షా ఏకగ్రీవంగా ఐసిసి బాస్‌గా ఎంపికయ్యాడు.

# ఖమ్మంలో పేదలపై రౌడీషీటర్లు, కబ్జాకోరుల దాడులు

### ప్రేక్షకపాత్ర వహించిన పోలీసులు

### చట్టప్రకారం వారు వ్యవహరిస్తే నిజమైన యజమానులు తేలేవారు

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** ఖమ్మంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. జెసిబిలు, డోజర్లతో భూ కబ్జాకోరులు పేదల గుడిసెల కూల్చివేతకు ఖాకీల సమక్షంలోనే పూనుకున్నారు. ఈ ఘటన మంగళవారం జిల్లా కేంద్రమైన కలెక్టరేట్ సమీపంలో చోటుచేసుకుంది. తమ గుడిసెలు కూల్చి నిరాశ్రయులను చేస్తున్న రౌడీ మూకలకు అడ్డుకట్ట వేయటం లేదంటూ పేదలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో వెలుగుమట్ల పంచాయతీ పరిధిలో భూదాన భూమి ఉంది. ఈ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు.

ఆ గుడిసెలో ఉన్న భూమి తమదేనని బీఆర్ఎస్‌లో ఉండి కబ్జాకోరుగా అవతారమెత్తిన ఓ దళారి రౌడీమూకలతో మూకమ్మడిగా దాడి చేయించారు. బీఆర్ఎస్‌లో కబ్జాకోరుగా పేరుందిన ఆ ప్రజాప్రతినిధి కాంగ్రెస్ బడా నేతలతో సాన్నిహిత్యం పెంచుకొని తమ కళ్ల ముందు ఈ సంఘటన జరుగుతున్న పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వెలుగుమట్ల పంచాయితి పరిధిలోని భూదాన భూమిలో జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన పేదలు వందలాది మందిగా వచ్చి గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. ఆ భూదాన భూమి సమీపంలో తమ పట్టా భూమి ఉందని కోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ పోలీసుల సహాయంతో, గుండాల సహాయంతో మధ్యాహ్నం 12గంటలకు చేరుకొని సాయంత్రం 6గంటల వరకు ఈ తతంగం నడిపారు. ఏసిపి రమణమూర్తి ఆధ్వర్యంలో ఖమ్మం త్రిటౌన్ సిఐ, ఖమ్మం అర్బన్ సిఐ నేతృత్వంలో 50 మంది వరకు పోలీసులు అక్కడ పహరా ఏర్పాటు చేశారు. చట్ట ప్రకారం భూమి ఎవరిదైతే వాళ్లు స్వాదీనం చేసుకోవచ్చుకానీ రౌడీ షీటర్లతో దౌర్జన్యానికి దిగడం పట్ల పేదలు తిరగబడ్డారు. సాయత్రం 6గంటల సమయంలో ఇరువర్గాల పోరుతో రబియా అనే మహిళ తలకు బలమైన గాయం కావడంతో నిరుపేదలు చేతికి దొరికిన హస్తాలు ఉపయోగించడంతో రౌడీషీటర్లు పరుగో పరుగు అంటూ కాళ్లకు బుద్ధి చెప్పారు.

అంత మంది పోలీసులు ఉండి కూడా చోద్యంగా చూడటం పట్ల పేదలు తీవ్ర స్థాయిలో తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మీ కళ్ల ముందే మా గుడిసెలు పీకేస్తున్న మా ఇండ్లలో చొరబడి సామాన్లు ధ్వంసం చేస్తున్న మీన మేషాలు లెక్కించారని దుయ్యబట్టారు.

**పదేళ్లు కబ్జాలే..**

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆయన ప్రాంతంలో లెక్కలేనన్ని కబ్జాలకు పాల్పడ్డారు. బీఆర్ఎస్ ఓటమి చెందగానే తమకున్న పరిచయాలను ఉపయోగించుకొని కాంగ్రెస్ నేతలో సాన్నిహిత్యం పెంచుకున్నారు. దీంతో అధికార పార్టీ నేతలు కూడా బీఆర్ఎస్ పాలనలో కబ్జాలపై కొరడా గుర్తించి కొందరిని జైళ్లకు కూడా పంపారు.

ఈ కబ్జా కోరు అయినా నేతలు మాత్రం తనకున్న ఆర్థిక బలం అంగబలంతో ముట్టుకునే ప్రయత్నం కూడా చేయలేదు. రోటరినగర్, గొల్లగూడెం, కొత్తగూడెం ప్రాంతాలలో ఎక్కడ చూసినా వీళ్ల కబ్జాలే కనిపిస్తున్నాయి. అధికార పార్టీ నేతలు మాత్రం ఈ కబ్జాలపై నోరుమెదపకపోవడం పట్ల జిల్లాలో చర్చనీయాంశమైంది. నాగార్జున సాగర్ పంట కాలువను సైతం ఆక్రమించి ఆపార్టుమెంట్లు, బిల్డింగ్‌లు నిర్మించి కోట్లు దండుకున్నారు.

ఈ భూమి వివాదంలో కోర్టు ఆదేశాల ప్రకారం చట్టరీత్యా చర్యలకు ఉపక్రమిస్తే ఈ సమస్య పోలీసులపై విమర్శలు ఉండేవి కావని గుడిసె వాసులు పేర్కొంటున్నారు. వాళ్ల సమక్షంలోనే తమపై దాడులు నిర్వహించడం పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ కబ్జాకోరులు అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలని వారి స్వాదీనంలో భూములకు విముక్తి కల్పించాలని వివిధ ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి.



## ఆసియా బాలికల సింగిల్స్ ఛాంపియన్ భారత్ షట్లర్ తన్వీ

**న్యూఢిల్లీ:** భారత్ టీనేజ్ షట్లర్ తన్వి పత్రి ఆసియా అండర్-15 బ్యాడ్మింటన్ బాలికల సింగిల్స్ ఛాంపియన్‌షిప్‌గా అవతరించింది. చైనాలోని చెంగ్డూ నగరంలో ఆసియా బాడ్మింటన్ బాలిక సింగల్స్ టోర్నీ చివరి రోజు ఆద్యాంతం నిలకడగా ఆడిన ఒడిశాకు చెందిన 13 ఏళ్ల తన్వీ వరుస గేముల్లో గెలిచింది. టాప్ సీడ్ హోదాలో బరిలోకి దిగిన తన్వి తుది పోరులో 22-20, 21-22తో రెండో సీడ్ వియత్నాంకు చెందిన ధిధు ముయోన్ ఎన్గ యెన్‌పై విజయం సాధించింది. టైటిల్ గెలిచిన క్రమంలో తన్వీ టోర్నీ మొత్తంలో తన ప్రత్యర్థులకు ఒక్క గేమ్ కూడా కోల్పోకపోవడం విశేషం. ఈ గెలుపుతో ఆసియా అండర్-15 బాలికల సింగిల్స్ విభాగంలో టైటిల్ సాధించిన మూడో భారత్ క్రీడాకారిణిగా తన్వి గుర్తింపు పొందింది. ఇక ఇదే టోర్నీలో బాలుర అండర్-17 సింగిల్స్ విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్‌కు చెందిన ప్లేయర్ జ్ఞాన దత్తు సెమీ ఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకాన్ని సాధించాడు.

## సూపర్ ఓవర్‌లో నైట్ రైడర్స్ విజయం

**న్యూఢిల్లీ:** మహిళల కరిబియన్ ప్రీమియర్ లీగ్‌లో గయానా అమెజాన్ వారియర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో నిర్ణీత ఓవర్లు ముగిసే సరికి ఇరు జట్లు 128 పరుగులకు పరిమితం కాగా, మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది. సూపర్ ఓవర్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన నైట్ రైడర్స్ వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేయగా, ఛేదనలో చేతులెత్తేసిన అమెజాన్ వారియర్స్ 6 బంతుల్లో 2 వికెట్లు కోల్పోయి 5 పరుగులకు మాత్రమే పరిమితమైంది. ఫలితంగా నైట్ రైడర్స్ విజయబావుటా ఎగుర వేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. 129 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన వారియర్స్ ఆది నుండి నిదానంగా ఆడటంతో విజయం సాధించ లేకపోయింది.

# టీమిండియాలో బ్యాడ్‌లక్ ప్లేయర్లు

## తొలి వన్డేనే వీరికి చివరి మ్యాచ్

### ఒకే మ్యాచ్‌తో కెరీర్ ముగిసిన దిగ్గజ ఆటగాళ్లు



**న్యూఢిల్లీ:** భారత్ దేశం తరపున వన్ డే ఇంటర్నేషనల్ ఆడే అవకాశం పొందిన నలుగురు దిగ్గజ టీమిండియా క్రికెటర్లుకు అదే వారి చివరి మ్యాచ్ అయింది. కేవలం ఒక మ్యాచ్ ఆడిన తర్వాత వన్డే కెరీర్ ముగిసిన నలుగురు భారత్ క్రికెటర్లు ఉన్నారు. మళ్లీ వారిని గూర్చి సెలక్టర్లు పట్టించులో లేదు. అటువంటి వారిలో తెలుసుకుంటే జమ్మూ కశ్మీర్‌కు చెందిన 30 ఏళ్ల పర్వేజ్ రసూల్ ఆల్ రౌండర్ ప్లేయర్‌గా గుర్తింపు పొందాడు. పర్వేజ్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ కాకుండా ఆఫ్ బ్రేక్ బౌలర్ కూడా కావడం విశేషం. 2014 ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంలో పర్వేజ్‌ను సన్ రైజర్స్ హైదరాబాద్ 95 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది. ఐపిఎల్ ఆడే అవకాశం పొందిన కాశ్మీర్‌కు చెందిన తొలి క్రికెట్‌గా అతడు రికార్డుకెక్కాడు. 2014 జూన్ 15న మిర్పూర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన భారత్ క్రికెట్ జట్టు కోసం తన వన్డే అంతర్జాతీయ (ఒడిఐ) అరంగేట్రం చేశాడు. అయితే అతని మొదటి ఒడిఐ మ్యాచే అతనికి చివరి మ్యాచ్ అని నిరూపితమైంది. ఈ మ్యాచ్‌లో పర్వేజ్ రసూల్‌కు బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. కానీ బౌలింగ్‌లో 2 వికెట్లు పడగొట్టాడు. ఇక పంకజ్ సింగ్ 2010 జూన్ 5న శ్రీలంకతో తన కెరీర్‌లో మొదటి వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడాడు. అయితే ఆ మొదటిమ్యాచ్ అతని చివరిమ్యాచ్‌గా మిగిలిపోయింది.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన పంకజ్ ఫాస్ట్ బౌలర్ కావడం విశేషం. శ్రీలంకపై పంకజ్ సింగ్ 42 బంతుల్లో 45 పరుగులు ఇచ్చాడు. కానీ ఒక్క వికెట్ కూడా తీయలేదు. అలాగే మహారాష్ట్రకు చెందిన ఫైజ్ ఫజల్ ఎడమ చేతివాటం కలిగిన బ్యాట్స్‌మెన్. గతంలో సెంట్రల్ జోన్, ఇండియా రెడ్, ఇండియా అండర్-19, రైల్వేస్, రాజ స్థాన్ రాయల్స్ తరపున ఆడాడు. 2015-16 దేవధర్ ట్రోఫీలో, ఫైజ్ ఫజల్ ఇండియా బితో జరిగిన ఫైనల్‌లో టీమిండియా ఏ తరపున 112 బంతుల్లో 100 పరుగులు చేశాడు. 2015-16 ఇరానీ కప్‌లో ముంబైకి వ్యతిరేకంగా 480 పరుగుల విజయవంతమైన పరుగులో రెస్ట్ ఆఫ్ ఇండియా తరపున ఫజల్ 127 పరుగులు చేశాడు. అతని 2018-19 దులీప్ ట్రోఫీకి ఇండియా బ్లూ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఫౌజల్ 2016లో జింబాబ్వేతో తన మొదటి ఒన్డే ఇంటన్నేషనల్ మ్యాచ్ ఆడాడు. ఇందులో అతను 61 బంతుల్లో 90.16 స్ట్రైక్ రేట్‌తో 55 పరుగులు చేశాడు. కానీ ఇది తన మొదటి ఒన్డే అంతర్జాతీయ మ్యాచ్ మాత్రమే కాకుండా చివరి మ్యాచ్ అని నిరూపితమైంది. కాగా బిఎస్ చంద్రశేఖర్ 16 ఏళ్ల కెరీర్‌లో 59 టెస్టు మ్యాచ్‌లు ఆడి 29.74 సగటుతో 242 వికెట్లు తీశాడు. తన మొత్తం టెస్టు, ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో సాధించిన పరుగుల కంటే ఎక్కువ వికెట్లు తీసిన ప్రపంచంలోని ఏకైక క్రికెటర్ చంద్రశేఖర్. 1972లో పద్మశ్రీ అవార్డు కూడా వరించింది. 1972లో విస్డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా ఎంపికయ్యాడు.

ఇక చంద్రశేఖర్ 1976లో న్యూజిలాండ్‌తో ఆడాడు. అందులో అతను బౌలింగ్‌లో 12 సగటుతో 36 పరుగులకు 3 వికెట్లు తీసుకున్నాడు. అతను బ్యాటింగ్‌లో 12 బంతుల్లో 11 పరుగులు చేశాడు.

# టి20 సిరీస్ విండీస్ కైవసం



### వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడిన దక్షిణాఫ్రికా

**న్యూఢిల్లీ:** దక్షిణాఫ్రికాతో వరుసగా జరిగిన రెండో మ్యాచ్‌లో విండీస్ విజయం సాధించి టి20 సిరీస్‌ను కైవసం చేసుకుంది. టరౌబా వేదికగా సోమవారం దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో టి20లో వెస్టిండీస్ 30 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ బ్యాటర్ షాయ్ హోప్ 41 పరుగులు, రోవ్‌మన్ పావెల్ 35 పరుగులు, రూథర్‌ఫోర్డ్ 29 పరుగులు, అలిక్ అథనాజ్ 28 పరుగులతో ఒక మోస్తరు స్కోర్లు చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 179 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా విండీస్ పేసర్లు రొమారియో షెపర్డ్ (4-0-15-3). షమార్ జోసఫ్ (4-0-31-3), అకీల్ హోసేన్ (4-0-25-2), మాథ్యూ ఫోర్డ్ (2.4-0-25-1) ధాటికి 19.4 ఓవర్లలో 149 పరుగులకు ఆలౌట్ అయింది.

ఇక దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్‌లో రీజా హెండ్రిక్స్ 44 పరుగులు, ట్రిస్టన్ స్టబ్స్ 28 పరుగులు, ఎయిడెన్ మార్క్రమ్ 19 పరుగులు, ర్యాస్ రికెల్టన్ 20 పరుగులు, రస్సీ వాన్ డర్ డస్సెన్ 17 పరుగులు మాత్రమే చేయగలిగారు. ఈ గెలుపుతో వెస్టిండీస్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో కైవసం చేసుకుంది. పూరన్ మెరుపులతో విండీస్ తొలి మ్యాచ్‌లో విజయం సాధించింది. నామ మాత్రపు మూడో టి20 ఈ నెల 27న టరౌబా వేదికగా జరగనుంది. కాగా టి20 సిరీస్‌కు ముందు వెస్టిండీస్, దక్షిణాఫ్రికా మధ్య రెండు టెస్ట్ మ్యాచ్‌లు జరగ్గా, ఈ సిరీస్‌ను దక్షిణాఫ్రికా 1-0 తేడాతో కైవసం చేసుకుంది.



## టి20 వరల్డ్ కప్‌కు ఆస్ట్రేలియా టీమ్ రెడీ

**న్యూఢిల్లీ:** ఈ సారి మహిళల ప్రపంచ కప్ టోర్నీ కోసం ఆసిస్ పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగుతోంది. సీనియర్లు అంతా జట్టుకు అందుబాటులోకి వచ్చారు. ఈ నేపథ్యంలో మహిళల టి20 వరల్డ్ కప్ కోసం ఆస్ట్రేలియా టీమ్ సిద్ధమైంది. యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ వేదికగా ఈ ఏడాది అక్టోబరులో మహిళల టి20 వరల్డ్ కప్ జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఆస్ట్రేలియా ఈ సారి కూడా టైటిల్ సాధించి వరుసగా నాలుగు టి20 వరల్డ్ కప్‌లు సాధించిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించాలని ఉవ్విళ్లూరుతోంది. ఇందుకు అనుగుణంగా 15 మంది సభ్యులతో ఆస్ట్రేలియా జట్టును ప్రకటించింది. ఈ టీమ్‌కు కెప్టెన్‌గా అలైసా హీలీ ఎంపిక కాగా, వైస్ కెప్టెన్‌గా తహిల మెక్‌గ్రాత్ వ్యవహరించనుంది. సీనియర్ స్పిన్నర్ జెస్ జోనాస్సెన్‌ను పక్కన పెట్టిన ఆస్ట్రేలియా క్రికెట్ సెలక్టర్లు పేజ్ బౌలర్ తైలా వ్లేమింక్‌కు చోటు కల్పించారు. ఆస్ట్రేలియా మహిళల జట్టులో అలైసా హీలీ (కెప్టెన్), డార్సి బ్రౌన్, యాష్ గార్డనర్, కిమ్ గార్త్, గ్రేస్ హ్యారిన్, అలానా కింగ్, ఫొబ్ లిచ్‌ఫీల్డ్, తహిళ మెక్‌గ్రాత్ (వైస్ కెప్టెన్), సోఫీ మోలినెక్స్, బెత్ మూనీ, ఎల్లిస్ పెర్రీ, మెగాన్ షట్, అన్నాబెల్ సదర్‌ల్యాండ్, జార్జియా వేర్హామ్, తైలా ఫ్లేమింక్ ఉన్నారు. కాగా టీ 20 వరల్డ్ కప్ ఈ ఏడాది అక్టోబరు 3వ తేదీ నుండి 20వ తేదీ వరకూ యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌లో జరగనుంది. ఈ టోర్నీలో మొత్తం 10 జట్టు రెండు గ్రూపులుగా విభజించబడి పోటీ పడతాయి. గ్రూప్-ఎలో భారత్, ఆస్ట్రేలియా, శ్రీలంక, న్యూజిలాండ్, పాకిస్తాన్ ఉండగా, గ్రూప్ బిలో వెస్టిండీస్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, స్కాట్లాండ్ జట్టు పోటీపడనున్నాయి.




## ఫాతిమా కెప్టెన్‌గా పాక్ ప్రపంచ కప్ మహిళా టీమ్

**న్యూఢిల్లీ:** త్వరలో ప్రారంభమయ్యే మహిళల టి20 వరల్డ్ కప్ టోర్నీకి ఇప్పటికే వివిధ దేశాల జట్లు తమ టీమ్‌లను ప్రకటిస్తున్నాయి. ఇందులో భాగంగా నెల రోజులు ముందుగానే పాకిస్థాన్ తన జట్టును తాజాగా ప్రకటించింది. ఆల్ రౌండర్ ఫాతిమా సనా నాయకత్వంలో 15 మంది సభ్యులతో కూడిన పటిష్టమైన జట్టును ఈ మెగా టోర్నీకి ఎంపిక చేసింది. ప్రస్తుత పాక్ మహిళా జట్టు కెప్టెన్‌గా ఉన్న నిదా దార్‌ను పాక్ క్రికెట్ బోర్డు పక్కన పెట్టింది. ఈ కొత్త జట్టులో ఫాతిమా సనా (కెప్టెన్), అలియా రియాజ్, డయానా బేగ్, గుల్ ఫిరోజా, ఇరామ్ జావేద్, మునీబా అలీ (వికెట్ కీపర్), నష్రా సంధు, నిదా దార్, ఒమైమా సోహైల్, సదాఫ్ షమాస్, సాదియా ఇక్బాల్, సిద్రా అమీన్, సయ్యదా అరూబ్ షా, తస్మియా రుబాబ్, తుబా హసన్ ఉన్నారు. కాగా ప్రస్తుతం పాక్ మహిళా జట్టుకు కెప్టెన్‌గా నిదా దార్ వ్యవహరిస్తోంది. ఆల్ రౌండర్ అయిన నిదా ఆఫ్ స్పిన్నర్‌గా గుర్తింపు ఉంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండు విభాగాల్లోనూ జట్టులో కీలకం కానున్న తరుణంలో టి20 ప్రపంచ కప్‌కు పోటీ పడే జట్టులో ఈమెను తప్పించడం పాక్‌కు పెద్ద దెబ్బగానే భావిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల జరిగిన పొట్టి ఫార్మాట్‌లో జట్టును విజయపథంలో నడిపించకపోవడే ఆమెపై వేటు పడింది. నిదా దార్ నాయకత్వంలో పాకిస్థాన్ జట్టు 24 టి20లు ఆడగా, కేవలం 9 టి20ల్లోనే విజయం సాధించింది.

# ఐపిఒకు 'బజార్ స్టైల్ రిటైల్'!

**ముంబై, ఆగస్టు 26:** బజార్ స్టైల్ రిటైల్ కంపెనీ ఇప్పటికే తన ఐపిఒకి సంబంధించిన దరఖాస్తును సెబి వద్ద ఉంచింది. మెయిన్ కేటగిరీలో వస్తున్న ఐపిఒ రూ.834.68 కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో కొత్త ఇష్యూ రూ.148 కోట్లు ఉండగా, మిగిలిన మొత్తం ఆఫర్ ఫర్ సేల్ రూపంలో ప్రమోటర్లు విక్రయించే వాటాల ద్వారా సమీకరించనున్నారు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ఐపిఒ లిస్టింగ్ సెప్టెంబర్ 6న ఎన్ఎస్ఇ, బిఎస్ఇలో ఉంటుందని తెలుస్తోంది. ఈ క్రమంలో బజార్ స్టైల్ రిటైల్ తన ఐపిఒ ప్రైస్ బ్యాండ్ ధరను రూ.370 నుంచి రూ.389గా నిర్ణయించింది. అలాగే పెట్టుబడిదారుల కోసం లాట్ పరిమాణాన్ని 38 షేర్లుగా ప్రకటించింది. దీని ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం ఒక లాట్ కొనుగోలు చేసేందుకు రూ.14,782 ఇన్వెస్ట్ చేయాల్సి ఉంది. రిటైల్ పెట్టుబడిదారుల కోసం ఐపిఒ ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 3 వరకు తెరచి ఉండనుంది. కంపెనీ ఐపిఒ ద్వారా సమీకరించిన



మొత్తంలో కొంత భాగాన్ని రుణాల చెల్లింపులకు వినియోగించాలని చూస్తోంది. దీనికి తోడు సాధారణ కార్పొరేట్ ప్రయోజనాల కోసం కూడా ఈ డబ్బును వినియోగించనుంది. కంపెనీ ఆర్థిక పనితీరును పరిశీలిస్తే 2024లోకంపెనీ మొత్తం ఆదాయం యేడాది ప్రాతిపదికన రూ.794 కోట్ల నుంచి 23శాతం పెరిగి రూ.982 కోట్లుగా నివేదించింది. ఈ క్రమంలో లాభం రూ.21 కోట్లుగా నివేదించబడింది.

# యుపిఐ తరహాలో యుఎల్ఐ..

**న్యూఢిల్లీ, ఆగస్టు 26:** యుపిఐ సేవల ద్వారా డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టిన రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మరో కొత్త తరహా సేవలకు నాంది పలకనుంది. రుణాలు తీసుకోవడాన్ని సులభతరం చేయడం కోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యుఎల్ఐ)ను జాతీయ స్థాయిలో త్వరలో లాంచ్‌చేయనుంది. గతేడాదే 'ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్' పేరిట ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన ఆర్‌బిఐ అవి సత్ఫలితాలు ఇవ్వడంతో త్వరలో దేశ వ్యాప్తంగా సేవలు అందించేందుకు సిద్ధమైంది. 'డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో యుపిఐ ఏవిధమైన పాత్ర పోషిస్తోందో..రుణ వితరణలో యుఎల్ఐ కూడా అదేపాత్ర పోషించబోతోంది. దేశ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ జర్నీలో యుఎల్ఐ కీలక భూమిక నిర్వహించబోతోంది' అని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. బెంగళూరులో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆయన దీనిపై మాట్లాడారు. భూ రికార్డులు మొదలుకొని, ఇతర ముఖ్యమైన డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా యుఎల్ఐ పనిచేస్తుందని చెప్పారు. దీనివల్ల రుణ ఆమోద ప్రక్రియ సరళతరం కానుందని తెలిపారు. రుణం పొందేందుకు డాక్యుమెంటేషన్ ప్రక్రియ అవసరం ఉండదని శక్తికాంతదాస్ వివరించారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఇ, వ్యవసాయ రుణాల జారీ వేగవంతం కానుందని పేర్కొన్నారు. గతేడాది ఆగస్టు 17న ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ పేరిట పైలట్ ప్రాజెక్ట్‌ను లాంచ్ చేశారు. ఆర్‌బిఐకి చెందిన రిజర్వ్ బ్యాంకు ఇన్నోవేషన్ హబ్ ద్వారా దీన్ని చేపట్టారు.



# విజయ్ శేఖర్ శర్మకు సెబి నోటీసులు!

**ముంబై, ఆగస్టు 26:** ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ పేటీఎం మాతృ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ షేర్లు సోమవారం భారీగా కుంగాయి. కంపెనీ వ్యవస్థాపకుడు శేఖర్ శర్మకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు వార్తలు రావడమే ఇందుకు కారణం. దీంతో సోమవారం పేటీఎం షేర్లు ఓ దశలో బిఎస్ఇలో 8.88 శాతం క్షీణించి 505.25కు చేరడం విశేషం. తర్వాత కాస్త కోలుకున్నాయి. 2021 పేటీఎం ఐపిఒకు వచ్చిన విషయం విదితమే. పబ్లిక్ ఇష్యూకు సంబంధించి ప్రమోటర్ క్లాసిఫికేషన్ నిబంధనలు పాటించలేదంటూ ఆర్‌బిఐఇచ్చిన ఇన్‌పుట్స్ మేరకు సెబి, విజయ్ శేఖర్‌కు షోకాజ్ నోటీసులు జారీచేసినట్లు సంబంధిత వర్గాలను ఒక కథనం వెలువడింది. అంతేకాకుండా మాజీ బోర్డు మెంబర్లకు కూడా ఈ నోటీసులు జారీ అయినట్లు తెలిసింది. ఈయేడాది పేటీఎంపేమెంట్స్ బ్యాంకుపై చర్యలు తీసుకున్న విషయం విదితమే. 2021లో పేటీఎం ఇష్యూ ధర రూ.2150 కాగా, 9శాతం డిస్కౌంట్‌తో రూ.1995 వద్ద షేర్లు లిస్టయ్యాయి. దీంతో ఆరంభంలోనే నిరాశపరిచింది. ఇన్వెస్టర్లకు నష్టాలను మిగిల్చింది. తర్వాత ఏనాడూ ఆ స్థాయికి చేరింది లేదు. పైగా పేటీఎం పేమెంట్స్ బ్యాంకుపై ఆర్‌బిఐచర్యల నేపథ్యంలో ఈ యేడాది షేరు ధర రూ.310 వద్ద కనిష్టానికి చేరింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వేళ తాజా షాక్ తగిలింది.



# ఫోర్కాస్ స్టూడియో లిస్టింగ్ అదుర్స్

**ముంబై, ఆగస్టు 26:** ఫోర్కాస్ స్టూడియో కంపెనీ ఐపిఒ మార్కెట్‌లో బలమైన లిస్టింగ్‌ను నమోదు చేశాయి. ఈ క్రమంలో లిస్టింగ్ రోజున ఇష్యూ ధరతో పోలిస్తే షేర్ల ధర రెండింతలు కావడంతో పెట్టుబడిదారులు మొదటి రోజే తమ పెట్టుబడి సొమ్మును రెట్టింపు చేసుకున్నారు. అలాగే లిస్టింగ్ తర్వాత సైతం మార్కెట్లో కంపెనీ షేర్ల కొనుగోలుకు డిమాండ్ భారీగా కనిపించింది. ఎన్ఎస్ఇ ఎస్ఎంఇ కేటగిరీలో వచ్చిన ఫోర్కాస్ స్టూడియో స్టాక్ మార్కెట్లో అద్భుతమైన లిస్టింగ్ ద్వారా పెట్టుబడిదారులను ధనవంతులుగా మార్చేసింది. వాస్తవానికి కంపెనీ ఇష్యూ సమయంలో ఒక్కో షేరుకు అప్పర్ ప్రైస్ బ్యాండ్ ధరను రూ.80 వద్ద విక్రయించగా, సోమవారం మార్కెట్లో 90శాతం ప్రీమియం ధర వద్ద ఒక్కో షేరు రూ.152 రేటుకు మార్కెట్లో జాబితా అయ్యాయి. అలాగే అద్భుతమైన లిస్టింగ్ తర్వాత కంపెనీ షేర్లు అప్పర్ సర్క్యూట్‌కి చేరి రూ.159.60కు చేరాయి. ఈ క్రమంలో కంపెనీ ఇష్యూ ప్రైస్ బ్యాండ్ ధరను కంపెనీ రూ.77-80గా ఉంచింది. ఐపిఒలో పాల్గొనేందుకు రిటైల్ ఇన్వెస్టర్ల కోసం ఆగస్టు 19 నుంచి ఆగస్టు 21 వరకు అవకాశం కల్పించబడింది. తాజా ఐపిఒ ద్వారా కంపెనీ మార్కెట్ల నుంచి రూ.37.44 కోట్లను విజయవంతంగా సమీకరించింది. ఇందుకోసం 46.80 లక్షల షేర్లను జారీచేసింది.



# సెబి బ్యాన్‌పై రంగంలోకి దిగిన 'అనిల్'


**ముంబై, ఆగస్టు 26:** గతవారం ముందు వరకు వరుసగా పాజిటివ్ వార్తలతో ఒకప్పటి బిలియనీర్ అనిల్ అంబానీ వార్తల్లో నిలిచారు. అయితే ప్రస్తుతం భారత స్టాక్ మార్కెట్ రెగ్యులేటరీ సంస్థ సెబి చర్యలతో వార్తల్లో అంబానీ సోదరుడి పేరు మారుమోగుతోంది. ఇన్వెస్టర్లలో పెద్ద గందరగోళానికి దారి తీసిన ఈ వ్యవహారంపై అనిల్ అంబానీ స్పందించారు. సెబి విధించిన జరిమానా, నిషేధంపై ముందుకు వెళ్లేందుకు తగిన లీగల్ ఆప్షన్ పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. వాస్తవానికి గతంలో రిలయన్స్ కేపిటల్ సబ్సిడరీ సంస్థగా ఉన్న రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ కంపెనీలో భారీగా నిధుల మళ్లింపు రుణాల మాటున జరిగిందని గుర్తించిన సెబి అనిల్ అంబానీతో పాటు అనేక మంది గత కంపెనీ ఉద్యోగులపై చర్యలకు ఉపక్రమించింది. ఈ వ్యవహారంలో మొత్తం అంబానీతో పాటు మరో 24 మందిపై రూ.624 కోట్లు ఫైన్ వేసింది. అలాగే ఫిబ్రవరి 11, 2022 నాటి సెబి మధ్యంతర ఉత్తర్వుకు అనుగుణంగా రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ బోర్డులకు రాజీనామా చేసినట్లు అంబానీ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. అయితే సెబి ఆగస్టు 22 నాటి తుది ఉత్తర్వును అనిల్ అంబానీ సమీక్షిస్తున్నారని, న్యాయ పరంగా సలహా మేరకు తగిన చర్యలు తీసుకుంటారని ప్రతినిధి వెల్లడించారు. ఇదే వ్యవహారంపై రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్పందిస్తూ సెబి కంపెనీకి వ్యతిరేకంగా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని, ఫిబ్రవరి11, 2022నాటి మధ్యంతర ఉత్తర్వు ప్రకారం రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ల బోర్డు నుంచి అనిల్ అంబానీ ఇప్పటికే రాజీనామా చేశారని స్పష్టం చేసింది. ఇదే తరహాలో రిలయన్స్ పవర్ కూడా ఒక ప్రకటన విడుదల చేస్తూ కంపెనీపై సెబి చర్యల ప్రభావం లేదని వెల్లడించింది. అయితే సెబి చర్యలు అనిల్ అంబానీ లిస్టెడ్ కంపెనీల్లో కొంతఅలజడిని సృష్టించాయి. భయాందోళనకు గురైన పెట్టుబడిదారులు వాటాల విక్రయానికి కూడా దిగారు. మొత్తానికి అనిల్ అంబానీ చాలా కాలం తర్వాత తిరిగి బౌన్స్ బ్యాక్ అవుతున్న సమయంలో సెబి చర్యలు మళ్లీ కష్టాలను తెచ్చిపెడుతున్నాయి.




# వాణిజ్యం

## స్టాక్ సూచీలకు 'ఫెడ్' జోష్..

**ముంబై, ఆగస్టు 26:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ముగిసాయి. అమెరికా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన సూచీలూ దూసుకెళ్లాయి. విదేశీ పెట్టుబడులూ కలిసొచ్చాయి. రేట్ల కోతకు సమయం వచ్చిందని అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్‌పర్సన్ జెరోమ్ పావెల్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లలో జోష్‌కు కారణం. దీంతో సెన్సెక్స్ ఓ దశలో 700కిపైగా పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 25వేల స్థాయి ఎగువన ముగియడం



విశేషం. సెప్టెంబరులో కనీసం 25 బేసిస్ పాయింట్లు మేర రేట్ల కోత ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. సెన్సెక్స్ ఉదయం 81,388.26 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 81,824.27 పాయింట్ల వద్ద గరిష్టానికిచేరింది. చివరికి 611.90 పాయింట్లు లాభపడి 81,698.11 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 182.75 పాయింట్లు పెరిగి 25,005 పాయింట్ల వద్ద నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.83.89గా ఉంది. హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, ఎన్‌టిపిసి, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్‌మహీంద్రా, జెఎస్‌డబ్ల్యూ స్టీల్ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. అదానీ పోర్ట్స్, మారుతి సుజుకి, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 79.76 డాలర్ల వద్ద కొనసాగుతోంది. అమెరికా వడ్డీ రేట్ల కోత అంచనాల వేళ పసిడికి డిమాండ్ ఏర్పడింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.